بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపుటి 1 | సంచిక 30

వార పత్రిక

# బదర్

ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

వార్షిక చందా 300/-రూ॥

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

26 జుల్ హజ్ 1437 హి.ఖ, 29 తబూక్ 1395, హి.శ, 29 సెప్టెంబర్ 2016

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ ముమినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

**శుభప్రధమైన, ఆపద రహితమైన విశ్వాసం కేవలం అల్లాహ్ తాలా ప్రవక్తల ద్వారనే లభించును. ఎందుకనగా వారి విశ్వాసం కేవలం దేవుడు ఉండాలి అని ప్రకటించుట వరకే పరిమితం కాకుండా వందల దైవ నిదర్శనములను తిలకించిన పిదప, దేవుడు ఉన్నాడు అనే ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి చేరుకుంటారు. కావున వాస్తవము ఏమిటనగా దేవునిపై విశ్వాసంను పటిష్ఠము చేసుకొనుటకు ప్రవక్తలను విశ్వసించడం అమృతం సేవించడం వంటిది. అంతేగాకా ప్రవక్తలపై విశ్వాసం ఉన్నంత కాలం దేవునిపై విశ్వాసం ఉండును. ఒకవేళ ప్రవక్తలపై విశ్వాసం లేకున్నచో దేవునిపై గల విశ్వాసంలో క్షీణత చోటు చేసుకొనును. పైగా ఇలాంటి నామ మాత్రపు విశ్వాసం మానవున్ని త్వరగా మార్గ భ్రష్టున్ని చేస్తుంది**

**(ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

3వ ప్రశ్న, హుజూర్ గారు, మీరు అబ్దుల్ హకీం గారికి వ్రాసిన ఉత్తరములో స్వభావిక విశ్వాసం ఒక శపించిన వస్తువులాంటిదని పేర్కొన్నారు. దాని భావం మాకు అర్థం కాలేదు.

సమాధానం: ఆ అంశపు సారంశమేమనగా ఏ విశ్వాసమునైతే మానవుడు అల్లాహ్ ప్రవక్త ద్వార పొందకుండ కేవలం అల్లాహ్ తాలా అవసరమును తెల్పి చెప్పే మానవ స్వభావం నుండి పొందునో అట్టి విశ్వాసం చివరకు శాపగ్రస్థులుగా మార్చుతుంది. అందుకు ఉదా॥ తత్వవేత్తల విశ్వాసం. ఎందుకనగా అట్టి విశ్వాసం అంధాకారంతో నిండి యుండును, అందువలనే వారు వారి విశ్వాసం నుండి వైదొలుగుతు త్వరలోనే నాస్తికులుగా మారుదురు. ప్రథమముగా వారు స్వభావిక సుగుణాలకు, సృష్టి ధర్మమునకు ప్రాధాన్యత నిచ్చెదరు. కాని వారికి అవతార పురుషుల తేజస్సు నుండి కాంతి రేఖలు లభించనందున వారు త్వరగా అంధాకారంలో చిక్కుకొని మార్గ భ్రష్టులగుదురు. శుభప్రధమైన, ఆపద రహితమైన విశ్వాసం కేవలం అల్లాహ్ తాలా ప్రవక్తల ద్వారనే లభించును. ఎందుకనగా వారి విశ్వాసం కేవలం దేవుడు ఉండాలి అని ప్రకటించుట వరకే పరిమితం కాకుండా వందల దైవ నిదర్శనములను తిలకించిన పిదప, దేవుడు ఉన్నాడు అనే ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి చేరుకుంటారు. కావున వాస్తవము ఏమిటనగా దేవునిపై విశ్వాసంను పటిష్ఠము చేసుకొనుటకు ప్రవక్తలను విశ్వసించడం అమృతం సేవించడం వంటిది. అంతేగాకా ప్రవక్తలపై విశ్వాసం ఉన్నంత కాలం దేవునిపై విశ్వాసం ఉండును. ఒకవేళ ప్రవక్తలపై విశ్వాసం లేకున్నచో దేవునిపై గల విశ్వాసంలో క్షీణత చోటు చేసుకొనును. పైగా ఇలాంటి నామ మాత్రపు విశ్వాసం మానవున్ని త్వరగా మార్గ భ్రష్టున్ని చేస్తుంది. అందువలనే మానవుని అస్థిత్వాన్ని ఆధారం చేసుకున్న స్వభావిక విశ్వాసం శాపగ్రస్తమైనదని నేను తెలిపినాను. అట్టి విశ్వాసపు పునాది మానవుని ఉనికికి అనుగుణంగా పోలి యుండును కాని ప్రవక్తల కాంతి రేఖల నుండి పొందినదై యుండదు. కావున అంతిమముగా అది వారిని శాపగ్రస్తులను చేస్తుంది. మొత్తమునకు ఎవరి విశ్వాసం అల్లాహ్ తాలా, అతని ప్రవక్తల అద్భుతాలను వీడి కేవలం వారి ఉనికినే ఆధారం చేసుకొని యుండునో అతడి విశ్వాసం ఇసుక గోడతో సమానం. అతడు ఈ రోజైన, మరుసటి రోజైన తప్పక నాశనమగును. స్వచ్ఛమైన విశ్వాసం దైవ అవతార పురుషులను గుర్తించిన పిదప లభిస్తుంది. అట్టి విశ్వాసానికి తిరోగతి, దాని అంతిమ ఫలితం దుర్భరంగా ఉండదు. కాని ఎవరైతే అవతార పురుషులను కేవలం నామ మాత్రంగా అనుసరిస్తారో వారు వారిని సరిగా గుర్తించి వారి ద్వారా లభించు శుభములను గూర్చిన అవగాహనను పొందిన వారి పరిధిలోకి చేరనందున అట్టి వారి విశ్వాసానికి ఎలాంటి ప్రాధాన్యత దక్కదు. చివరికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో మార్గ భ్రష్టులైన ముసైలమా కజ్జాబ్, అబ్దుల్లాహ్ బిన్ అబి సరహ్ మరియు అబ్దుల్లా బిన్ జహష్, అదే విధముగా హజ్రత్ ఈసా (అ) కాలంలో మార్గ భ్రష్టులైన యహూదా, ఇస్క్ర్యూతి మరియు పాంసూ, నేడు నా కాలంలో మార్గ భ్రష్టులైన చిరాఘ్ దీన్ జమ్ము వాలా, అబ్దుల్ హకీం ఖాన్ వారి వలే వారు కూడ ఒక రోజు తప్పక మార్గ భ్రష్టులగుదురు.

ప్రశ్న 4: “భూకంపములు సంభవించును. గత్తర ప్రభలును, కరువు కాటకాలు ఏర్పడును” ఇవి కూడ భవిష్యవాణులేనా? అని ముందు రచించిన ఇజాలే అవ్హాం వంటి పుస్తకాలలో వ్రాసిరి, కాని ఆ తదుపరి పుస్తకాలలో ఆ భవిష్యవాణులనే అద్భుతమైన భవిష్యవాణులుగా పేర్కొనడం జరిగినది. (1)

సమాధానం: నేను ఇంజీల్ భవిష్యవాణులను అద్భుతమైన భవిష్యవాణులుగా పేర్కొన్నట్లు వ్రాయడం సరి కాదు. ఒక వస్తువు ప్రాధాన్యత, అప్రాధాన్యత, ఆయా వస్తువుల పరిణామము, పరివర్తనము, ప్రత్యేక మరియు సాధారణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ధారించడం జరుగుతుంది. హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఏ దేశంలో భూకంపాలు, గత్తర ప్రభలుతాయని భవిష్యవాణి చేసిరో ఆయా దేశాలలో ఎల్లప్పుడు గత్తర ప్రభలుతూనే ఉండేది. కాశ్మీర్‌లో సంభవించినట్లు అధికంగా భూకంపాలు వస్తుండేవి. కరువు కాటకాలు ఏర్పడేవి. యుద్ధాలు జరుగేవి. హజ్రత్ మసీహ్ (అ) చేసిన భవిష్యవాణులలో భూకంపాల విషయంలో గాని, గత్తర ప్రభలు విషయంలో గాని ఎలాంటి అద్భుత శక్తి బహిర్గతం కావడం లేదు. ఇలాంటి పరిస్థుతులలో ఏ వివేకవంతుడు కూడ ఆయా భవిష్యవాణులను ప్రత్యేకత, ప్రాధాన్యత గల దృష్టితో చూడలేడు. 2 కాని ఏ దేశాలను ఉద్దేశించి నేను భయంకరమైన భూకంపాలు వచ్చునని, గత్తర వ్యాపించునని భవిష్యవాణి చేసినానో ఆయా దేశాల మౌళిక, భౌగోళిక అంశాల దృష్ట్యా అవి చాలా ప్రాధాన్యత గల భవిష్యవాణులు. ఎందుకనగా ఆయా దేశాల చరిత్రను పరిశీలించినచో కొన్ని వందల సంవత్సరాల నుండి ఆయా దేశాలలో భూకంపాలు సంభవించినట్లు, గత్తర ప్రభలినట్లు ఏలాంటి సాక్ష్యాధారాలు లభించలేదు. గత్తర కూడ ఎంత భయంకరమైనది అనగా చాలా తక్కువ సమయంలోనే లక్షల జనులను నాశనం చేసినది. అందువలనే గత్తరను గూర్చి నేను చేసిన భవిష్యవాణి పదాలు ఈ విధముగా కలవు. **“దేశములోని ఏ ప్రాంతము కూడ గత్తర సోకకుండా ఉండదు. అది చాలా భయానక వాతావరణము నెలకొల్పును, ఆ వినాశనం చాలా కాలం వరకు కొనసాగును.”** ఈ భవిష్యవాణిని దృష్టి యందుంచుకొని ఆయా దేశాలలో గతంలో ఎప్పుడైన ఇంత పెద్ద మొత్తంలో వినాశనంను సృష్టించిన గత్తర వ్యాధులు ప్రభలినట్లు ఎవరైన నిరూపించగలరా?. ఇది అసాధ్యము. భూకంపాలను గూర్చి నేను చేసిన భవిష్యవాణి అసాధారణమైనది. ఆ భవిష్యవాణులలో దేశపు ఒక భాగం భూకంపాలతో నాశనమగుననే పదాలు కూడ గలవు. కావున మనము సమన్యాయంతో పరిశీలించినచో కాంగ్డా మరియు భాగోసూ ప్రత్యేకించి జ్వాల ముఖిలో ప్రళయంను సృష్టించిన భూకంపాలు గత రెండు వేల సంవత్సారాలలో ఇంత దారుణంగా వచ్చినట్లు చరిత్రలో ఎక్కడ పేర్కొనబడలేదు. ఆంగ్లేయ శాస్త్రవేత్తలు కూడ వారి పరిశోధనలతో ఈ విషయాన్ని నిరూపించిరి. ఈ స్థితిలో నాపై అభ్యంతరాలు వ్యక్తపర్చడంను కేవలం తొందరపాటు చర్యగా కాకుండ మరేమి అనబడును?.

(1) గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమిటనగా ఇంజీల్‌లో పేర్కొనబడిన హజ్రత్ మసీహ్ (అ) భవిష్యవాణులలో కేవలం సాధారణమైన, మృధుత్వం గల పదాలు మాత్రమే ఉపయోగించబడినవి. అంతేగాని ఎలాంటి భయంకర, కఠినమైన పదాలు ప్రస్తావించబడలేదు. కాని నేను చేసిన భవిష్యవాణులలో ఈ రెండు అంశాలతో పాటు అవి దైవశక్తి వలన బహిర్గతమవుతాయనే విషయాలను ప్రస్తావించడం జరిగినది.

(2) ప్రస్తావించబడిన భవిష్యవాణులలో మార్పులు, చేర్పులు జరిగి యుండవచ్చును. వాస్తవాన్ని చూసినచో ఒక ఇంజీల్ నుండి రెండు పదుల ఇంజీల్‌లు ఏర్పడినపుడు ఇలాంటి పరిస్థితులలో ఇంజీల్‌లో మార్పులు జరిగినవి అని తెలుపుటలో సంశయించవలసిన అవసరం లేదు. ఏది ఏమైనప్పటికి ప్రస్తుతం ఆచరణలో గల ఇంజీల్‌పై మాకు అభ్యంతరములు ఖచ్చితంగా గలవు. అల్లాహ్ తాలా స్వయంగా అవి పరివర్తనం చెందినవని తెల్పడం జరిగినది. అందువలన అవి అభ్యంతరమునకు అర్హత కల్గినవి.

(హఖీ ఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్ సంపుటి 22, పుట162-164)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

## సంపాదకీయం:-

### M.T.A ద్వార ప్రయోజనం పొందవలెనని హుజూర్ గారి సూచన తల్లిదండ్రులు, పిల్లలు స్వయంగ M.T.A తో లబ్ది పొందవలెను.

వర్తమాన ఖలీఫా ప్రసంగములను వినుటకు అతి సులభమైన మార్గము, మాధ్యమము **M.T.A** అని తెలుపుటలో ఎలాంటి సంశయం లేదు. **M.T.A** లేనిచో మనము ఖలీఫా గారి వెను వెంట వెలువడు సందేశములను ఆలకించలేము, ఖిలాఫత్ వ్యవస్థతో స్వచ్ఛందంగా అనుసంధానం కాలేము.

సయ్యద్నా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ 5వ ఖలీఫ అయ్యదహు అల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ మనకు పదే పదే ఆరాధనలలో, ప్రార్ధనలలో, దైవభీతిలో, పవిత్రతలో, వినయ విధేయతలో, ఖిలాఫత్ వ్యవస్థతో అనుసంధాన మవుటలో, వాగ్దానములను నెరవేర్చుటతో పాటు అనేక సత్కార్యములను కొనసాగించవలెనని, అన్ని రకాల చెడుల నుండి దూరం ఉండవలెనని మనకు శ్రద్ధ కల్పించిన ప్రతిసారి ప్రపంచం మొత్తములో ఉన్న అహ్మదీయులందరు ఎం,టి,ఏ ద్వారా ప్రయోజనం పొందవలెనని సూచించడం జరుగుతుంది. వర్తమాన ఖలీఫా గారి ఆదేశమును పాటించుట, ఆ ఆదేశమును ఆచరించి చూపుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము. ఖలీఫా గారి సాన్నిహిత్యం లభించవలెనని ఎందరో కోరుకుంటారు. చూడడానికి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న కూడ వారి ఆదేశాలను శిరసా వహించే వారందరు ఖలీఫా గారికి అత్యంత సమీపంలో ఉన్నవారనే అర్ధం. ఒకవేళ ఎవరైన వారి ఆదేశాలకు ప్రాధాన్యత నివ్వనిచో, వాటిని శ్రద్ధతో పాటించనిచో వారు ఖలీఫాకు ఎంతగా సమీపంలో ఉన్నను వారు దూరంగా ఉన్నవారి గానే భావించ బడుదురు. అందుకే ఖలీఫాగారి ఆదేశాలను ఆలకిస్తు వాటిని పాటించుటయే ఖిలాఫత్ పట్ల గల అభిమానానికి ఒక చిహ్నం.

ప్రపంచములో ఉన్న అహ్మదీ స్త్రీ, పురుషులను, యువతి యువకులను, పిల్లలను వృద్ధులను ప్రతి ఒక్కరిని **M.T.A** తో అనుసంధానం కావలెనని, దాని ద్వార ప్రయోజనం పొందవలెనని సూచించుచున్న సందర్భమున మనము ఈ విషయము వైపు ప్రత్యేక శ్రద్ధను కనబర్చవలెను. ఖలీఫా గారు మనకు శ్రద్ధ కల్పించుచున్న ఈ అంశం నేటి సమయానికి అనుకూలమైనదే. ఈ మాధ్యమము కేవలం పిల్లలకు మాత్రమే కాకుండా పెద్దల శిక్షణకు కూడ సహాయపడుతుంది. దీనితో ప్రయోజనం పొందుతు ప్రపంచములో ఎందరో అహ్మదీయ్యత్‌ను స్వీకరిస్తున్నారు. (అల్ హంద్ లిల్లాహ్) అంతర్జాతీయ్య ముస్లిం టిలివిజన్ అహ్మదియ్య అల్లాహ్ ఒక అనుగ్రహం అను తెలుపుటలో ఎలాంటి సందేహం లేదు. దీనిని గౌరవించుట మన కర్తవ్యం.

హుజూర్ అన్వర్ అయ్యదహు అల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ డెన్మార్క్ మరియు స్వీడన్‌లో పర్యటిస్తు పదవి దారులు స్వయంగా **M.T.A** ను తిలకిస్తు వారి పిల్లలకు కూడ **M.T.A** ను తిలకింప జేయాలని పదే పదే సూచించడం జరిగినది. కావున **M.T.A** నుండి ప్రయోజనం పొందవలెనన్న హుజూర్ గారి కోరికాను సారం వారి కొన్ని ఆదేశాలను పాఠకుల ప్రయోజన దృష్ట్యా ఇచట పేర్కొనడం జరుగుచున్నది.

### మీరు మీ కుటుంబ సభ్యులందరు అధికముగా M.T.A ఏ ను తిలకించవలెను:

ఘానా వార్షిక బహిరంగ సభలో పాల్గొనిన వారిని ఉద్దేశిస్తు హుజూర్ అన్వర్ ఇట్లు తెల్పిరి:

"నేను మీకు హితోపదేశం చేయునది ఏమనగా మీరు, మీ కుటుంబ సభ్యులు అందరు అధికముగా **M.T.A** ను తిలకించవలెను. నా జుమా ప్రసంగాలతో పాటు అనేక సందర్భాలలో ప్రసంగించిన ఉపన్యాసములను కూడ వినవలెను. దీని వలన కేవలం ఖిలాఫతే అహ్మదియ్యతో మీ అనుబంధము పటిష్ఠమవడంమే గాకుండా, ఇతర కార్యక్రమాలను తిలకించడం వలన ఇస్లాం యొక్క సుందరత, మరియు అహ్మదియ్యత్ లోగల ప్రత్యేకతలను గూర్చి కూడ తెలుసుకోవడం ద్వారా మీకు జ్ఞానోదయం కల్గుతుంది".

(జనవరి 2016లో నిర్వహించిన ఘానా వార్షిక బహిరంగ సభ నుద్దేశించి హుజూర్ గారు పంపిన సందేశం, జూన్ 9, 2016, పుట 2 ఆధారంగా)

### మీ శిక్షణ మరియు ఖిలాఫత్ వ్యవస్థతో పటిష్ఠత కొరకు M.T.A ను తిలకించుట అలవర్చుకోవలెను.

మార్చి 4, 2016న అంతర్జాతీయ్య అహ్మదియ్య జమాఅత్‌ను ఉద్దేశించి హుజూర్ అన్వర్ అయ్యదహు అల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి:

" తమ శిక్షణకై మరియు ఖిలాఫత్ వ్యవస్థతో పటిష్ఠత కొరకై ప్రతి అహ్మది **M.T.A** ను తప్పక చూడవలెను, చూచుటను అలవర్చుకోవలెను. **M.T.A** మరియు ఇతర వెబ్ సైట్లలో ప్రసారమయ్యే ప్రచార కార్యక్రమాలను ఇతరులకు కూడ చూపించవలెను. సమయం దొరకిన ప్రతి సారి తమ మిత్రులతో కలసి ఈ కార్యక్రమాలను చూడవలెను. మిత్రులకు వాటిని గూర్చి పరిచయం చేయవలెను. మేము **M.T.A** ను క్రమం తప్పకుండా చూడడం ప్రారంభించిన నాటి నుండి మాకు జమాఅత్‌తో పటిష్ఠమైన అనుబంధం ఏర్పడినదని, తమ విశ్వాసం కూడ వృద్ధి చెందినదని అనేకులు నేటికి కూడ నాకు ఉత్తరములు వ్రాస్తున్నారు. కావున **M.T.A** మరియు జమాఅత్ వెబ్ సైట్‌లు గలవు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ప్రచారంను వ్యాపింప జేయుటకు ఇవి చాలా ప్రయోజనకరమైన సాధనాలు. అదే విధముగా ప్రతి అహ్మది శిక్షణకు మరియు జమాఅత్ వ్యవస్థతో, ఖిలాఫత్ వ్యవస్థతో అనుసంధానం చేందుటకు కూడ దోహద పడును. కావున అహ్మదీయులందరు **M.T.A** మరియు జమాఅత్ వెబ్ సైట్‌ల నుండి లబ్ధి పొందుటకు ప్రయత్నించవలెను.

### ప్రతి అహ్మదీ కుటుంబీకులు ప్రతి వారం M.T.A ద్వారా జుమ ప్రసంగమును తప్పకుండా వినవలెను.

### అంతేగాకా ప్రతి రోజు ఒక గంట సమయం M.T.A లో ప్రసారమయ్యే ఇతర కార్యక్రమాలను తిలకించవలెయును.

హుజూర్ అన్వర్ మే 20, 2016న తన జుమా ప్రసంగంలో సభ్యులను ఉద్దేశించుతు ఇలా ప్రసంగించిరి:

" అల్లాహ్ తాలా మనకు **M.T.A** ను ప్రసాదించాడు. జమాఅత్ సభ్యుల ఆధ్యాత్మిక, విజ్ఞాన వృద్ధికై వెబ్ సైట్‌ను అనుగ్రహించినాడు. కావున మన దృష్ఠిని వీటి వైపు మళ్ళించినప్పుడు మనకు వీటిపై ప్రత్యేక శ్రద్ధ ఏర్పడుతుంది. తద్వార మనము అల్లాహ్ తాలాకు సమీపులమై, షైతాన్ నుండి దూరం ఉండు వారమగుదుము.

ఒకవేళ మనము వార్తలు, ఇతర కార్యక్రమాల కోసం ప్రాపంచిక చానల్స్‌ను చూడదల్చుకున్నచో అప్పుడు తగు జాగ్రతలు కూడ తీసుకోవలెను. తల్లిదండ్రులు స్వయంగా ఈ విషయంలో జాగ్రతలను పాటించుచు తమ పిల్లలను తమ వెంట కూర్చోబెట్టుకొని సభ్యకరమైన కార్యక్రమాలను తిలకించవలెను. అసభ్య, అశ్లీల కార్యక్రమాల నుండి దూరం ఉండవలెను. ఇవి కేవలం సిగ్గుమాలిన, తలవంపులు తెచ్చు అంశంల వైపే దారి తీయును. అంతేగాకా అల్లాహ్ తాలా నుండి కూడ దూరం చేయును. అందువలనే ప్రతి అహ్మది కుటుంబీకులు తమ కుటుంబ సభ్యులతో కలసి ప్రతి వారం **M.T.A** ద్వార జుమ ప్రసంగమును తప్పకుండ వినవలెనని మరియు ప్రతి రోజు ఒక గంట **M.T.A** లో ప్రసార మయ్యే ఇతర కార్యక్రమాలను తిలకించవలెనని ఒక ప్రణాళికను సిద్దం చేసుకోవలెను. ఈ కార్యచరణను ఏ అహ్మది గృహస్థులు ఆచరిస్తున్నారో అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఆయా కుటుంబీకులందరు ధార్మికత వైపు మొగ్గు చూపుచున్నారు, పిల్లలు కూడ ధార్మిక బోధనను నేర్చుకొనుచున్నారు, పెద్దలు కూడ ధార్మిక బోధనలను నేర్చుకొనుచున్నారు. ఈ కార్యచరణపై ఆచరించు వారికి ధార్మిక ప్రయోజనాలతో పాటు షైతాన్ నుండి కూడ వారు దూరం ఉందురు. అంతేగాకా అల్లాహ్ తాలా అనుగ్రహములను పొందుట వైపు వారి దృష్ఠి మరలును. తద్వార వారి గృహాలలో శాంతి నెలకొనును మరియు శుభములు వర్షించును".

(జుమ ప్రసంగం, మే 20, 2016. సేకరణ: బదర్ వార పత్రిక, జూన్ 9, 2016.పుట5, ప్రథమ శీర్షిక)

### ఒకవేళ జుమ సమయం ఒకటే అయినచో వర్తమాన ఖలీఫా ప్రసంగమునే వినవలెను.

జులై 1, 2016 నాటి జుమ ప్రసంగంలో హుజూర్ అన్వర్ అయ్యదహు అల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ఒక ప్రత్యేక విషయం వైపు శ్రద్ధను కనబర్చుతు ఇట్లు తెల్పిరి:

"ఈ విషయంను కూడ నేను మీ ముందు ప్రస్తావించెదను. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఈ కాలంలో అల్లాహ్ తాలా మనకు **M.T.A** లాంటి ఒక అద్భుత సౌకర్యమును ఏర్పాటు చేసెను. యూరప్ మరియు ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాలలో జుమా సమయం ఒకే విధముగా ఉంటుంది. సమయం ఒకటే అయినచో వర్తమాన ఖలీఫా గారి జుమా ప్రసంగమునే వినవలెను. జమాఅత్‌లో ఐక్యతను పెంపొందించుటకు ఇలాంటి సౌకర్యమును ఏర్పాటు చేసి ఒక నూతన మార్గమును సుమగం చేయడంను కూడ మనము అల్లాహ్ తాలా ఉపకారము గానే భావించవలెను. భిన్న సమయాలు ఉన్న ప్రదేశాలలో కూడ అహ్మదీయులు జుమా ప్రసంగమును వినవలెను. ఒకవేళ ప్రత్యక్ష ప్రసారం విననిచో తదుపరి ప్రసారమయ్యే వేళలో తప్పక చూడాలి. అదే విధముగా నా జుమా ప్రసంగంను ఆధారం చేసుకొని ఆయా ప్రాంతాలలో జుమా ప్రసంగమును ఇచ్చు ముభల్లిఘ్‌లు, మోల్వీలు నా జుమా ప్రసంగమును ఆ రోజు లేదా మరుసటి రోజు లేదా మరుసటి వారం తప్పకుండా చదువి వినిపించవలెను. పశ్చిమ దేశాలను పరిశీలించినచో అచట ఉదయపు వేళ అవుతుంది. వారు ఉదయమే నా జుమా ప్రసంగమును వింటారు. కావున మరల జుమా సమయంలో కూడ నా ప్రసంగమును వినిపించవచ్చును. కాని తూర్పు దేశాలను పరిశీలించినచో అచట జుమా సమయం గడిచిపోవును. సాయంత్రం వేళ అవును. కావున వారు మరుసటి జుమాలో వినిపించవచ్చును. జమాఅత్‌లో ఐక్యతను పెంపొందించుటకు ఇది కూడ ఒక మార్గము. అంతేగాకుండా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలంనకు జుమాతో అనుబంధంను ఉన్నందున అల్లాహ్ తాలా ఈ మాధ్యమము కనుగొనింపజేసి తద్వారా వర్తమాన ఖలీఫా జుమా ప్రసంగమును కూడ అందులో ఒక భాగమును చేసెను".

(జుమా ప్రసంగం జులై 1, 2016. సేకరణ: బదర్ వార పత్రిక, ఆగష్టు 4, 2016. పుట 5)

### తల్లిదండ్రులు మరియు పిల్లలు స్వయంగా M.T.A ద్వారా లబ్ధి పొందవలెను.

ఇది ఒక ఆధ్యాత్మిక విందు, దీని వలనే మన ఆత్మకు జీవనం కలదు.

అస్ట్రేలియా వార్షిక బహిరంగ సభలో పాల్గొన్న సభ్యులనుద్దేశించి హుజూర్ గారు ఇట్లు హితోపదేశం చేసిరి:

"**M.T.A** లో ప్రసారమయ్యే కార్యక్రమాలను తప్పకుండా వీక్షించాలని నేను పదే పదే అహ్మదీయులకు హితోపదేశం చేసాను. తల్లిదండ్రులు కూడ ఇటు వైపు ప్రత్యేక శ్రద్ధను కనబర్చవలెను. తమ పిల్లలను **M.T.A** తో అనుసంధానం చేయగలరు. ఇది ఒక ఆధ్యాత్మిక విందు, దీని ద్వారనే మన ఆత్మకు జీవనం కలదు. దీని ద్వారనే ధార్మిక విద్య పెంపొందును. ఆధ్యాత్మికత వృద్ధి చెందును. ఖిలాఫత్ వ్యవస్థతో ఒక పటిష్టమైన అనుబంధము ఏర్పడును. అంతేగాకా ప్రపంచ ఇతర చానల్స్‌లో ప్రచారమయ్యే విషప్రభావం నుండి కూడ రక్షించబడుదురు. అల్లాహ్ తాలా మీ అందరికి నా ఆదేశాలకు అనుగుణంగా నడుచుకొను భాగ్యమును అందించును గాకా! (ఆమీన్)

(డిసెంబర్ 2015న నిర్వహించిన ఆస్ట్రేలియా వార్షిక బహిరంగ సభనుద్దేశించి పంపిన హుజూర్ గారి సందేశం. సేకరణ: బదర్ వార పత్రిక జూన్ 2, 2016 పుట 2)

అల్లాహ్ తాలా మనందరికి హుజూర్ గారి ఆదేశాల పట్ల సంపూర్ణ వినయ విధేయతలను ప్రదర్శించు మరియు ఖిలాఫత్ వ్యవస్థతో పటిష్ఠ అనుబంధమును కల్గియుండు అవకాశంను కల్పించుగాకా! (ఆమీన్)

# జుమా ప్రసంగము

ప్రపంచ దేశాలలో జీవనం కొనసాగిస్తున్న ప్రజల హృదయాలలో అల్లాహ్ తాలా ఏవిధముగా జమాఅత్ సత్య నిదర్శనములను చూపిస్తున్నాడో తెలుస్తుంది. కొందరికి సత్య స్వప్నముల ద్వార జమాఅత్ సత్యతను చూపించగా, మరి కొందరికి లెట్రిచర్స్, పుస్తకాలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిదర్శంను చూపించడం జరుగుతుంది. మరి కొన్ని ప్రాంతాలలో అహ్మదియ్య వ్యతిరేకులు అహ్మదియ్య వ్యాప్తికి ఎరువు వలె ఉపయోగ పడుచున్నారు. మరి కొన్ని ప్రాంతాలలో అహ్మదీయుల సత్ప్రవర్తన ఇతరులను అహ్మదీయ్యత్ వైపు ఆకర్శించుటకు దొహదపడుతుంది.

నేడు మీ లీఫ్ లెట్స్ చదివిన పిమ్మట ముస్లిం సమాజ సంస్కరణ కొరకు ఒక సంస్కర్త రావలసిన సమయం ఆసన్నమైనదనే విషయం మాకు గుర్తుకొచ్చినది, మాకు మీపై పూర్తి నమ్మకం ఉన్నది, మిమ్ము కలుసుకోవాలనే కోరిక ఏర్పడినదని అనేకులు ఫోన్ ద్వార తెలియపర్చుచుండిరి.

లీఫ్ లేట్స్ ద్వారా లేదా ప్రచారం వలన కేవలం ఆఫ్రికా వరకే ఈ సంఘటణలు పరిమితం కాకుండా మూడవ ప్రపంచముగా చెప్పుకోబడే మన ప్రాంతములో(ఇంగ్లాండ్) కూడ ప్రజలు అన్వేషణ కోనసాగిస్తున్నారు.

అల్లాహ్ తాలా కృపాను సారం ఈ నూతన అహ్మదీయులు కూడ జమాఅత్ వ్యవస్థతో పటిష్ఠమవుచున్నారు. చందా వ్యవస్థలో కూడ భాగస్వాములు. వారు పేదవారు. కొన్ని సందర్భాలలో ప్రయాణం కొరకు కూడ డబ్బును ప్రోగుచేసుకోలేని దీన స్థితి వారిది. అయిన కూడ కేంద్ర కార్యాలయములో కొనసాగు జమాఅత్ సమావేశాలకు తమ ప్రతినిధులను పంపుటకు చందాను ప్రోగుచేసి తమ ప్రతినిధులను పంపిరి.

పిల్లలకు ఇస్లాం బోధనలను నేర్పించుటకు ప్రత్యేక శ్రద్దను కనబర్చాలనే విషయమును అహ్మదీయ తల్లిదండ్రులందరు, జమాఅత్ నిర్వాహకులు, ముభల్లిఘ్లు, మౌల్విలు అందరు గుర్తుంచుకోవాలి. ఒకవైపు రాబోవు సంతానమును కాపాడుకోవసిన బాధ్యత మనపైనే గలదు, మరోవైపు బాలల ద్వార కూడ శిక్షణ, ప్రచార మార్గాలు సుమగం అవుతుంటాయి.

**సయ్యిద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 26 ఆగస్టు 2016 ( 26 జహూర్ 1395 హి.ష) తేదీన మస్జిద్ ఫజల్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ - اَلرَّحْمٰنِ الرَّحِيْمِ - مٰلِكِ يَوْمِ الدِّيْنِ -
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ -
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ -

లండన్ జల్సా రెండవ రోజు అల్లాహ్ తాలా అనుగ్రహముల వర్షంను గూర్చి వివరించడం జరుగుతుంది. అనేక శాఖలలో జరిగిన అభివృద్ధిని గూర్చి వివరించడం జరుగుతుంది. జమాఅత్ అభివృద్ధిని గూర్చి చర్చించడం జరుగుతుంది. అభివృద్ధి గాంచిన శాఖల వివరాలతో అనేక విశ్వాసభరిత సన్నివేశాలను కూడ ప్రస్తావించడం జరుగుతుంది. కాని కేవలం గంటన్నర లేదా రెండు గంటల సమయంలో అభివృద్ధి దశలో పయణిస్తున్న జమాఅత్ సంఖ్యలను, సన్నివేశాలను క్లుప్తంగా వివరించడం సాధ్యము కాదు. మీకు వినిపించుటకై నేను తయారు చేసుకొచ్చిన నోట్స్‌ను కూడ పూర్తి చేయకుండానే తీసుకవెళ్ళవలసి వస్తుంది. ఈ సంఖ్యలన్నింటిని తహ్‌రీకే జదీద్ వారు ప్రతి సంవత్సరము ఒక పుస్తక రూపంలో ప్రచురించడం ప్రారంభించినారు. కాని సన్నివేశాలను మాత్రం సమయాను కూలంగా నేను ప్రస్తావిస్తూనే ఉంటాను. అందులో భాగంగానే నేను ఈ రోజు మీ ముందు కొన్ని విశ్వాసభరితమైన సన్నివేశాలను ప్రస్తావించెదను. తద్వారా ప్రపంచ దేశాలలో జీవనం కొనసాగిస్తున్న ప్రజల హృదయాలలో అల్లాహ్ తాలా ఏవిధముగా జమాఅత్ సత్య నిదర్శనములను చూపిస్తున్నాడో తెలుస్తుంది. కొందరికి సత్య స్వప్నముల ద్వార జమాఅత్ సత్యతను చూపించగా, మరి కొందరికి లెట్రిచర్స్, పుస్తకాలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిదర్శంను చూపించడం జరుగుతుంది. మరి కొన్ని ప్రాంతాలలో అహ్మదియ్య వ్యతిరేకులు అహ్మదియ్య వ్యాప్తికి ఎరువు వలె ఉపయోగ పడుచున్నారు. మరి కొన్ని ప్రాంతాలలో అహ్మదీయుల సత్ప్రవర్తన ఇతరులను అహ్మదీయ్యత్ వైపు ఆకర్శించుటకు దొహదపడుతుంది. ఇవియే గాకుండా సుదూర ప్రాంతాలలో నివసించె వారికి కూడ అహ్మదియ్యత్‌ను స్వీకరించు విషయంలో ఎదురైన చిత్ర విచిత్రమైన వాఖ్యాలు కూడ గలవు. అహ్మదియ్య బాలల క్రమ శిక్షణను చూసి లేదా వారితో స్నేహం చేసినందున ఇతర బాలలలో ఏర్పడిన మార్పుల అద్భుత ఘట్టాలు కూడ మనకు కనిపించును. వీటి ద్వార ఇతరులు ప్రభావితులు కాకుండ ఉండలేరు. సారంశమేమనగా, ఒకవేళ సమన్యాయంతో పరిశీలించినచో బహ్యాముగా ఒక వ్యవస్థ ద్వార ఇస్లాం యొక్క స్వచ్ఛమైన సందేశమును మనము వ్యాపింపజేయుటకు ప్రయత్నిస్తున్నాము. కాని మనము చేసిన ప్రయత్నమునకు ఎన్నో రేట్లు అధికముగా అల్లాహ్‌తాలా ప్రతిఫలములను అందిస్తున్నాడు. మన ప్రయత్నముల వలన కాకుండా కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహముల వలనే అహ్మదియ్య జమాఅత్ అభివృద్ధి జరుగుచున్నది. లేదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఆధారం చేసుకొని ఇస్లాంను సందేశాన్ని వ్యాపింప జేయుటలో, మరియు ఆ సందేశమును స్వీకరించుటకు ప్రజల హృదయాలను తేరుచు కార్యము స్వయంగా అల్లాహ్ తాలాయే నెరవేర్చుచున్నాడని కూడ మనము చెప్పుకోవచ్చును. ఇదియే సత్యము. “నేను నీ సందేశాన్ని భూమండలపు అంచుల వరకు చేరవేయుదునని” అల్లాహ్ తాలా వారి(అ)కి తెల్పినప్పుడు అల్లాహ్ తాలాయే చాలా వరకు ఆ కార్యమును చక్కబెట్టును. మరియు మన ప్రయత్నముల వలన, మనము ప్రయోగించే కార్యాచరణ వలన కాకుండ కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహంతోనే అహ్మదియ్య సమాజ అభివృద్ధి జరుగుతుందని ప్రతి వివేకవంతుడైన అహ్మదీయునికి అవగాహన యున్నది. ఈ అంశంను విశ్లేషించకుండా నేను ఆ విశ్వాసభరిత సన్నివేశాలను మీ ముందు ప్రస్తావించెదను.

గని కన కరి ముభల్లిఘ్ గారు ఒక సంఘటణను గూర్చి ఇట్లు వ్రాసిరి. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన జమాఅత్ అహ్మదియ్య పరిచయంను గూర్చిన రెండు పేజిల లీఫ్ లెట్స్ దేశంలోని అనేక ప్రాంతాలలో పంచిపెట్టడం జరిగినది. ఫలితముగా మేము ఇమామ్ మహ్దిహ్ మరియు మసీహ్ గూర్చి మా పూర్వికుల నుండి వినేవారము, కాని నేడు మీ లీఫ్ లెట్స్ చదివిన పిమ్మట ముస్లిం సమాజ సంస్కరణ కొరకు ఒక సంస్కర్త రావలసిన సమయం ఆసన్నమైనదనే విషయం మాకు గుర్తుకొచ్చినది, మాకు మీపై పూర్తి నమ్మకం ఉన్నది, మిమ్ము కలుసుకోవాలనే కోరిక ఏర్పడినదని అనేకులు ఫోన్ ద్వార

తెలియపర్చుచుండిరి. ఈ విధముగా అల్లాహ్ తాలా దయ వలన మేము అనేకులను సంప్రదించగా వారు బైఅత్ చేసి జమాఅత్‌లో చేరిరి.

నేడు లీఫ్ లెట్స్ కేవలం చిరునామ తెలుపుటకు మాత్రమే దోహదపడుచున్నవి. కాని వాస్తవానికి అల్లాహ్ తాలాయే వారి హృదయాలను చాలా కాలం నుండే ఇందుకై సిద్దం చేసియున్నాడు. అందువలనే ఈ కాలంలో మసీహ్ మౌవూద్ అవతరణ ఆవశ్యకమని, ఒక సంస్కర్త అవసరము గలదని వివేకవంతులు గ్రహించిరి. లేనిచో ఇంతటి సుదూర ప్రాంతాలలో ఏ అహ్మదీయుని ప్రభావం వలన, ఏ అహ్మదియ్యా సందేశం వలన వారు అహ్మదియ్యత్‌ను స్వీకరిస్తున్నారని ఎవరు ప్రకటించగలరు?, ఇది కేవలం అల్లాహ్ తాలా మహిమయే, ఇందులో మానవ ప్రయత్నపు ప్రమేయం ఏ మాత్రం లేదు.

మరల తంజానియా దేశపు సంఘటనను వినుము. పై ఘటన పశ్చిమ ఆఫ్రికాకు చెందినదైతే ఈ ఘటన తూర్పు ఆఫ్రికాకు చెందినది. డుడోమా అనే పట్టణం గలదు, ఆ పట్టణపు ముభల్లిఫ్ గారిట్లు వ్రాసిరి: పవిత్ర ఖుర్ఆన్ ప్రదర్శన సమయంలో ఒక మహిళ మన ప్రదర్శనశాలకు వచ్చి ఇది ముసల్మానుల ప్రదర్శనయేనా? అని చాలా ఆశ్చర్యముతో ప్రశ్నించెను. ఆ తదుపరి ప్రదర్శనలో గల పుస్తకములను గూర్చి తెలుసుకోనసాగిరి. చివరికి క్రైస్తవ గ్రంథం ఆధారముగా ఇస్లాం ఘనతను గూర్చి ప్రచురించిన ఒక పుస్తకమును కొనుగోలు చేసిరి. మరుసటి రోజు ఆ మహిళ తన భర్తతో వారు సైనికు లైనందున సైనిక దుస్తువులలో మరల ప్రదర్శన శాలకు విచ్చేసి "ఇతను నా భర్త, మా వివాహం జరిగి చాలా కాలము అయినది, నేను ముసల్మాను మహిళను, నా భర్త క్రైస్తవుడు, నా భర్తకు ఇస్లాం అద్భుత బోధనలను పరిచయం చేసి అతనిని ముస్లింగా మార్చుటకు నేను చాలా కాలం నుండి ప్రయత్నిస్తున్నాను, కాని ఇస్లాంను గూర్చిన ఉత్తమ బోధనలు గల పుస్తకం ఏదియు నా చేతికి జిక్కలేదు. నేను నిన్న ఈ ప్రదర్శన శాలకు వచ్చినప్పుడు ఇది చాలా అనువైన ప్రదేశమని నేను భావించితిని. అందుకే నేను నిన్న ఒక పుస్తకమును కొనుగోలు చేసి నా భర్తకు ఇచ్చితిని. నా భర్తలో గల అనేక సందేహాలు ఆ పుస్తకము వలన నివృత్తి అయినవి. మీతో సంభాషించినచో ఇస్లాంను గూర్చిన సందేహములన్నియు పూర్తిగా దూరమవునని భావించి నేను వారిని మీ వద్దకు తీసుక వచ్చానని తెల్పిరి. అందువలన మన ముభల్లిఫ్ గారు వారి ఇరివురితో చాలా సమయం వరకు సంభాషించగా చివరికి ఆ మహిళ భర్త ఇస్లాంను స్వీకరించుటకు సుముఖతను తెల్పగా వారివురు బైఅత్ చేసి అహ్మదియ్యత్ అనగా స్వచ్ఛమైన ఇస్లాంలో చేరిరి. తన భర్తను ఇస్లాంలో చేర్పించవలననే ఆమే హృదయ పూర్వక కోరిక అనూహ్యరీతిలో అల్లాహ్ తాలా దయ వలన వారిని మన ప్రదర్శన శాల వైపు తీసుకవచ్చినది. అందువలన అహ్మదీయ్యత్‌ను స్వీకరించు భాగ్యమును అల్లాహ్ తాలా వారివురికి ప్రసాదించెను.

లీఫ్ లెట్స్ ద్వారా లేదా ప్రచారం వలన కేవలం ఆఫ్రికా వరకే ఈ సంఘటనలు పరిమితం కాకుండా లేదా కేవలం ఆఫ్రీకాలోనే ప్రజలు అన్వేషించుచున్నారనడం సమంజసం కాదు. మూడవ ప్రపంచముగా చెప్పుకోబడే మన ప్రాంతములో(ఇంగ్లాండ్) కూడ ప్రజలు అన్వేషణ కోనసాగిస్తున్నారు. మన ప్రాంతములోని హర్స్ ఫీల్డ్ ముభల్లిఫ్ గారు ఇట్లు వ్రాసిరి: ఇస్లాంను గూర్చి తెలుసుకోవాలనే అభిలాష గల వారు ఈ ప్రాంతములో అనేకులు ఉన్నారు. మరల ఇట్లనిరి: బర్నస్‌లే పట్టణములో ప్రచార కార్యక్రమములో భాగంగా లీఫ్ లెట్స్ పంచిపెట్టడం వలన వారితో సంప్రదింపులు జరిగినవి. కొన్ని రోజుల తదుపరి ఆయా ప్రాంతం నుండి 50 మంది పురుషులు, మహిళలు గల ఒక బృందం హర్స్ ఫీల్డ్ లో గల మన మస్జిద్‌నకు వచ్చిరి. వారు కేవలం ఇస్లాంను గూర్చి తెలుసుకోవాలనే ఉద్దేశంతో వచ్చిరి. వారందరితో సుమారు రెండున్నర గంటల పాటు చర్చించడం జరిగినది. అందులో భాగంగా వారికి ఇస్లాం, అహ్మదియ్యత్‌ను గూర్చి వారికి పూర్తిగా అవగాహన కల్పించడం జరిగినది. ఆ తదుపరి వారి ప్రశ్నలకు సమాధానములు కూడ ఇవ్వబడినవి. ప్రజలే స్వయంగా రావడం, ఇటు వైపు శ్రద్ధ చూపడంను చూసినచో అల్లాహ్ తాలాయే ప్రపంచములోని అన్ని ప్రాంతాలలోని ప్రజల హృదయపు వేణువును మ్రోగించుచున్నాడని అర్థం అవుచున్నది. ఒకవైపు ఇస్లాంకు వ్యతిరేకముగా ప్రచారం జరుగుచున్నది, మరోవైపు ముస్లింలే స్వయంగా ఇస్లాంను అప్రతిష్టకు గురి చేయుచున్నారు. అందువలన ముస్లిమేతరులు వారి వ్యతిరేకతలో హద్దులు మీరు చున్నారు. వీటన్నింటికి భిన్నంగా ప్రజలు స్వచ్ఛమైన ఇస్లాం గూర్చి తెలుసుకొనుటకు అల్లాహ్ తాలా తన వైపు నుండి మార్గమును సుమగం చేయుచున్నాడు.

సూదూర ప్రాంత ప్రజల హృదయాలలో గల విశ్వాసాన్ని అల్లాహ్ తాలా ఏవిధముగా పటిష్ట పర్చినాడో, వారిలో త్యాగ స్పూర్తిని ఎంతగా నింపినాడో ఈ వాఖ్యానాలను చూసినచో మనకు తెలుస్తుంది. బెనీన్ అధ్యక్షుల వారు ఇలా వ్రాసిరి: అలాడా రీజన్ లోని సూకు జమాఅత్‌లో ఈ సంవత్సరము ఫిబ్రవరిలో ఒక మస్జిద్‌ను నూతనంగా నిర్మించడం జరిగినది. మస్జిద్ నిర్మాణంలో జమాఅత్ సభ్యులు చాలా ఉత్సాహంతో, భక్తితో సహాయంను అందించిరి. వివిద దశలలో ఎదురైన ఆటంకాలను ఎదుర్కొనుటకు జమాఅత్ సభ్యులు తమ సమయాన్ని, ధనాన్ని త్యాగం చేస్తు శ్రామికులకు తోడునందించిరి. మహిళలు కూడ మస్జిద్ నిర్మాణంనకై దూర ప్రాంతాల నుండి నీటిని తెస్తు మస్జిద్ నిర్మాణంలో భాగస్వాములైరి. ఈ మస్జిద్ ఈ ప్రాంతానికి శాంతికి నిలయంగా మారునని సూకూ అధ్యక్షుల వారు తెల్పిరి. ఈ మస్జిద్ అలాడా రీజన్ కౌన్సిల్ కొరకు వాస్తవానికి ఒక కాంతివంతమైన గోపురమని ఆ ప్రాంత చీఫ్ గారు కొనియాడిరి. అంతేగాకా ఈ ప్రాంత ప్రజలలో అధికులు విగ్రహారాధకులు, ఆ ప్రాంతములోని చిన్న చిన్న రాజ్యలకు రాజులుగా చెప్పుకొనబడే వారిలో ఒక రాజు ఇట్లు తెల్పిరి: గతంలో నేను కూడ విగ్రహారాధన చేసేవాడిని, కాని అహ్మదియ్యా జమాఅత్ వలన నేను విగ్రహారాధనను వీడి ఏకేశ్వర వాదంను స్వీకరించినాను. అంతేగాకా ఈ జమాఅత్ సత్యానికి, ప్రేమకు ప్రతిరూపం. జమాఅత్ అహ్మదియ్యా వలనే నాకు జ్ఞానోదయమైనది. ఈ ప్రాంతానికి నేను రాజునే అయిన ఈ ప్రపంచానికి ఒక శక్తివంతమైన రారాజు గలడు, అతని ఆరాధించడం మనందరి భాధ్యత అని ఆ రాజు గారు తమ అభిప్రాయమును వెల్లడించిరి.

అహ్మదియ్యా జమాఅత్ సందేశం స్వచ్ఛమైనదని, ఇస్లాం బోధనలు సత్యమైనవని, మరియు జమాఅత్ అహ్మదియ్యా ప్రపంచంలో ప్రచారం చేస్తున్న బోధనలు, సందేశాలు వాస్తవమైనవని, వీటి ద్వారనే అన్యారాధకులు ఏకేశ్వరోపాసానంను అవలంభించెదరనే వివేకంను వారి హృదయాలలో అల్లాహ్ తాలాయే కల్పించుచున్నాడు. ఆ ప్రాంతానికి చెందిన మరో అధికారి ఇట్లనిరి: ఈ ప్రాంతములో ఇస్లాం ప్రచారం కొనసాగుచున్నప్పుడు ప్రజల దృష్టి అహ్మదియ్యత్ వైపు మరలునప్పుడు ఇస్లాం నామముతో భయభ్రాంతులకు గురి అయిన కొందరు, అహ్మదియ్యత్‌ను సహించని వారు అనేకులు నా వద్దకు వచ్చి వీరు ఇతర ఉగ్రవాద సంస్థల వలే మన వారిని హతమార్చి, మన పిల్లలను ఎత్తుకెళ్ళే ప్రయత్నంతోనే వచ్చిరని వారి ఆందోళనను వెల్లడించిరి. మరల ఆ అధికారి ఇట్లు తెల్పిరి, వారి ఆందోళన వలన అహ్మదీయులు నివసించే ప్రాంతాలలో వారి కార్యకలాపాలపై దృష్టిని కేంద్రికరించమని, వారు ఏదేని చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడుచున్నారా? లేదా? తెలుసుకొమ్మని రాత్రి వేళలో మా యువకులను అనేక ప్రాంతాలలో కాపలా కోసం నియమించితిమి. కాని మా అన్వేషణలు, అనుభవాల వలన జమాఅత్ అహ్మదియ్యా లక్ష్యం కేవలం శాంతిని పెంపొందించ దమేనని గ్రహించాము.

అహ్మదియ్యా వ్యతిరేకులు చాలా ఆశలు చూపి ప్రజలను అహ్మదియ్యా జమాఅత్ నుండి దూరం చేయుటకు ప్రయత్నిస్తుంటారు. కాని అల్లాహ్ తాలా సుదూర ప్రాంతములో నివసించే ప్రజల, తక్కువ విద్యను కల్గినవారి, నిరాక్ష్యరాసుల విశ్వాసాన్ని పటిష్ఠ పర్చినాడు.

బెనిన్‌లోని ఒక ప్రాంతము బోజిన్క్‌పే నుండి మన మౌల్వి గారు ఇట్లు వ్రాసిరి: ఇచట కొందరికి బైఅత్ చేసే అదృష్టం లభించినందున జమాఅత్‌ను స్థాపించడం జరిగినది. బైఅత్ చేయుటకు ముందు వీరందరు ముస్లింలు, కాని సమీపంలో గల మరో పట్టణ మస్జిద్ ప్రభావంనకు లోనై ఉండేవారు. బైఅత్ తదుపరి క్రమతప్పకుండా అచట వారికి క్లాసులను నిర్వహించడం జరుగేది. పవిత్ర ఖుర్ఆన్, నమాజ్, ఇతర ఇస్లాం బోధనలను నేర్పించసాగిరి. కొన్ని రోజుల తరువాత ఆ పట్టణ ఇమాం గారికి తెలియడంతో అతను జమాఅత్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టసాగెను. అహ్మదీయులు ముస్లింలు కారు, వారు మార్గ భ్రష్టులు, మీరు వారిని వీడమని పదే పదే వారిని బలవంతపెట్టేవాడు. అందుకు ఆ నూతన

అహ్మదీయులు మేము చాలా కాలం నుండి ఈ ప్రాంతములో నివసించుచున్నాము. మీరు ఏనాడు మావద్దకు రాలేదు. మా గురించి ఏనాడు పట్టించుకోలేదు. మా పిల్లలకు ఏనాడు ధార్మిక బోధనలను బోధించలేదు. కాని నేడు అహ్మదీయులు వచ్చి మా పిల్లలకు నమాజ్ విధానం, పవిత్ర ఖుర్ఆన్‌ను నేర్పిస్తున్నారు. అలాంటప్పుడు మీరు వచ్చి వారు ముస్లింలు కారని అంటున్నారు. ఈ విషయం మాకు అర్థం కావడం లేదు. మాకు నమాజ్ మరియు పవిత్ర ఖుర్ఆన్‌ను నేర్పించేవారు ఎలా మార్గ భ్రష్టులగుదురు. అల్లాహ్ తాలా కృప వలన వీరందరు తమ బైఅత్‌పై స్థిరంగా ఉన్నారు. ఆ ప్రాంతములో అల్లాహ్ తాలా దయ వలన ఒక మస్జిద్‌ను కూడ నిర్మించే భాగ్యము జమాఅత్‌కు దక్కినది.

మరల బెనీన్‌కు చెందిన ఒక మౌల్వి గారు ఇట్లు వ్రాసిరి: ఒక రోజు రేడియోలో ప్రచార కార్యక్రమము నిర్వహిస్తుండగా ఘూన్ హునోతో యర్క్ గారి నుండి ఫోన్ కాల్ వచ్చినది. ఆ మిత్రుడు తమ గ్రామ ప్రజలకు ప్రచారం చేయుటకై తమ గ్రామానికి రావలసినదిగా ఆహ్వానించిరి. ఆ మిత్రుడు తన చిరునామను తెల్పుచుండగానే ఫోన్‌కాల్‌కు అంతరాయం ఏర్పడి నందువలన సంభాషణ పూర్తి గాలేదు. మరల ముభల్లిగ్ గారు ఇట్లు వ్రాసిరి. ఒక రోజు మేము ప్రచారంనకై సిన్‌వేకొవ్‌తా అనే గ్రామమునకు చేరుకుంటిమి. మమ్ము చూసి ఒక వ్యక్తి నిలబడి, రోజు రేడియోలో ప్రచారం చేస్తున్న వారు స్వయంగా మన గ్రామానికి వచ్చారని చుట్టు ప్రక్కల వారిని ప్రోగు చేసెను. తద్వారా అచట ప్రచారం చేయడం వలన 200 మందికి పైగా బైఅత్ చేసి అహ్మదియ్యత్‌లో చేరగా అచట ఒక జమాఅత్‌ను కూడ స్థాపించడమైనది.

వారు బైఅత్ చేసి కొన్ని రోజులే అయినను వారి విశ్వాసపు పటిష్టతను కూడ చూడండి, బైఅత్ చేసిన రెండవ రోజే భారి వర్షాల కారణంగా ఇరక్ గారి గృహపు గోడ కూలినది. ఆ గోడ కూలడం వలన వారి 8 నెలల పసికందు మృత్యువాత పడెను. అది విగ్రాహారాధకుల గ్రామము, అందువలన ఆ గ్రామ విగ్రాహారాధకులు "చూడు నీవు క్రొత్త ధర్మమును స్వీకరించినందున నీకు వెంటనే కష్టాలు ఎదురైనాయని" హేళన చేయగా, "నేను సత్యాన్ని గ్రహించి విశ్వసించినాను. ఇక సంతానం, ధనము వంటి వాటిని దేవుడే ఇస్తాడు, మరల అతడే తిరిగి తీసుకుంటాడు. ఏది ఏమైనను నేను ఈ జమాఅత్ నుండి వెనుదిరుగే ప్రసక్తే లేదు, నేను అహ్మదియ్యత్‌ను స్వీకరించాను, అహ్మదీయుడిని, మరియు అహ్మదీయుడిగానే మరణించెదను ఇన్షా అల్లాహ్" అని వారికి ఈరాక్ గారు సమాధానం ఇచ్చిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ద్వారా ప్రజల హృదయాలలో అల్లాహ్ తాలా ఏర్పాటు చేసిన పటిష్ట విశ్వాసం, ఏకేశ్వరోపాసానం ఇది. వారు తమ స్వంత భూమిలో కొంత భాగాన్ని నమాజ్ సెంటర్ కోసం కేటాయించిరి. అంతేగాకా ఖుర్ఆన్ తరగతులు ప్రారంభించడానికి వారే స్వయంగా ఆ ప్రదేశంలో ఒక గుడిసెను ఏర్పాటు చేసిరి.

అల్లాహ్ తాలా ఈ విధముగా అహ్మదియ్యత్ అనగా స్వచ్ఛమైన ఇస్లాం సందేశమును వ్యాపింపజేయుటకు మార్గాలను ఏర్పాటు చేస్తాడో తెల్పుటకు తంజానియాకు చెందిన ఒక ముభల్లిఫ్ గారు ఇట్లు వ్రాసిరి: షాయాన్‌గా రీజన్ కు చెందిన బౌతిబూ అనే ఒక గ్రామములో ఒక సంవత్సరము క్రితం జమాఅత్‌ను ఏర్పాటు చేయడం జరిగినది. ఆదే రీజన్‌కు చెందిన మరో గ్రామములో ప్రచార కార్యక్రమము కొనసాగిస్తుండగా, బౌతిబూ గ్రామానికి చెందిన ఒక మహిళ అనుకోకుండ అక్కడికి చేరుకొనెను. జమాఅత్ సందేశమును విన్న పిదప ఆ మహిళ మీరు మా గ్రామానికి కూడ రండి, మా గ్రామములో కూడ ముస్లింలు ఉన్నారు. ఒక మస్జిద్ ఉన్నది. కాని మీరు తెలుపుచున్న ఇస్లాంనకు, వారు ఆచరిస్తున్న ఇస్లాంనకు చాలా భేదము గలదని వారితో విన్నవించుకొనిరి. అందువలన మన మౌల్వి గారు ఆ గ్రామానికి చేరుకొని అచట అహ్మదియ్య సందేశమును ప్రచారం చేయగా, ఆ రోజునే మస్జిద్ ఇమాంతో కలసి 93 మంది అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. ఈ విషయం తెలుసుకున్న సున్ని మౌల్విలు ఆ గ్రామానికి చేరుకొని మీరు మతభ్రష్టులైనారని, మీరు మోసపోయారని, అహ్మదీయులు ముస్లింలు కారని గ్రామస్థులకు అసత్యాలు తెలుపుచుండిరి. అందుకు ఆ నూతన అహ్మదీయులు మేము సత్యమును తెలుసుకొన్న పిదపయే అహ్మదియ్యత్‌ను స్వీకరించాము, ఇదే స్వచ్ఛమైన ఇస్లాం, అందువలనే మేము మీ మాటలను విశ్వసించమని వారికి సమాధానం చెప్పి పంపించిరి. ప్రజలు సున్ని మౌల్వి మాటలు వినకపోవడంతో వారి పెద్ద మౌల్వి ఆ గ్రామ మౌల్విని తన కార్యాలయమునకు వచ్చి కలువమని ఆదేశించెను. అయిన కూడ ఆ మౌల్వి అతని ఆదేశమును నిరాకరించెను. అల్లాహ్ తాలా కృపాను సారం ఈ నూతన అహ్మదీయులు కూడ జమాఅత్ వ్యవస్థతో పటిష్ఠమవుచున్నారు. చందా వ్యవస్థలో కూడ భాగస్వాములు. వారు పేదవారు. కొన్ని సందర్భాలలో ప్రయాణం కొరకు కూడ డబ్బును ప్రోగుచేసుకోలేని దీన స్థితి వారిది. అయిన కూడ కేంద్ర కార్యాలయములో కొనసాగు జమాఅత్ సమావేశాలకు తమ ప్రతినిధులను పంపుటకు చందాను ప్రోగుచేసి తమ ప్రతినిధులను పంపిరి. ఆ నూతన అహ్మదీయుల వలనే వారి సమీపంలో గల మరో రెండు గ్రామాలలో జమాఅత్‌ను ఏర్పాటు చేయడం జరిగినది. వారు కూడ జమాఅత్ వ్యవస్థను అనుసరిస్తున్నారు.

అదే విధముగా షయానిగా రీజన్‌కు చెందిన మరో గ్రామము తంజానియాలో కూడ జమాఅత్‌ను ఏర్పాటు చేయడం జరిగినది. గత కొన్ని సంవత్సారాలుగా అచట ముస్లింలు ఉంటున్నారు. అచట మట్టితో కట్టిన ఒక మస్జిద్ కూడ ఉన్నది. అచటకు మన మౌల్విగారు వెళ్ళి ప్రచారం చేయగా ఆ ప్రచారం ఫలితముగా 130 మంది మస్జిద్ ఇమాంతో కలసి జమాఅత్‌లో చేరినారు. అహ్మదియ్యత్‌ను స్వీకరించిన పిదప వారి గ్రామ పెద్ద ఈది గారు మన జమాఅత్ సమావేశాలకు దారుస్సలాం కూడ వచ్చిరి. జమాఅత్ వ్యవస్థ యొక్క పటిష్ఠతను చూసి చాలా ప్రభావితులైరి. మేము 1993 నుండి ముస్లింలమే కాని జమాఅత్‌లో చేరు భాగ్యము లభించినందున మేము అదృష్టవంతులము అని వారు తెల్పిరి.

బ్రూకీన ఫాసు ఆఫ్రికాకు చెందిన మరొక దేశం. అచట ఫ్రెంచ్ భాష మాట్లడుదురు. అక్కడి ముభల్లిఫ్ గారు ఇట్లు వ్రాసిరి. ఈ సంవత్సరము జమాఅత్‌కు తినీకు థోగూ రీజన్‌లో ఒక అందమైన మస్జిద్‌ను నిర్మించే భాగ్యము లభించినది. ఆ గ్రామములో అహ్మదియ్య జమాఅత్‌ను పరిచయం చేసినప్పుడు ఆ గ్రామ ఇమాం గారితో కలసి గ్రామస్థులందరు బైఅత్ చేసిరి. వ్యతిరేక మౌల్వి ఆ గ్రామమునకు చేరుకొని మీరు అహ్మదియ్యత్‌ను వీడినచో చాలా అందమైన, విశాలమైన మా మస్జిద్‌ను మీకు ఇచ్చెదమని తెలుపెను. అయిన కూడ అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఆ గ్రామస్తులు మరియు గ్రామ అహ్మదీ ఇమాం, జమాఅత్‌నే అంటి పెట్టికొని ఉన్నారు. అంతేగాకా కువైట్ లేదా సౌది అరబ్ నుండి వచ్చిన డబ్బుతో నిర్మించిన అందమైన మస్జిద్‌పై ఆ మట్టి మస్జిద్‌కే అధిక ప్రాధాన్యతనిచ్చిరి. ప్రస్థుతం అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ఆ గ్రామములో ఒక పటిష్ఠమైన మస్జిద్‌ను ప్రధాన రహదారిపై నిర్మించే అవకాశం లభించినది. అందువలన మన మస్జిద్‌ను గూర్చిన ప్రచారం పట్టణమంతయు మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో వ్యాపించినది. ఆ మస్జిద్ ప్రారంభోత్సవ వేడుకలో చుట్టు ప్రక్క పట్టణాల నుండి ఇమాంలు మరియు గౌరనీయ వ్యక్తులు పాల్గొనిరి. అంతేగాకా ఆ ప్రాంత రాజు గారు కూడ ఆ వేడుకలో పాల్గొనిరి. ఆ వేడుకలో పాల్గొన్న వ్యతిరేక ఇమాంలలో ఒకరు నేను ఇక్కడ చూస్తున్నదే అహ్మదియ్య జమాఅతా? అని మూడు మార్లు ప్రశ్నించెను. మరల ఇట్లనెను. దీని అర్థం ఇంత వరకు నేను జమాఅత్‌ను గూర్చి వినినదంతయు అసత్యమన్న మాటా?. కాని నేను ఈ సందర్భముగా తెలుపునది ఏమనగా అహ్మదియ్యత్‌ను మించి ఇస్లాం అంటు మరొకటి లేదు. అందుకే స్వచ్ఛమైన ముస్లింలకు, ఇస్లాం పట్ల తపన కల్గినవారు, ఇస్లాం ప్రపంచములో వ్యాపిస్తుండగా చూడలని ఆకాంక్షించే వారు జమాఅత్ నుండి బయటకు వెళ్ళి చూసినచో వారికి వాస్తవం కనిపించదు. అందుకే నిశ్చయముగా నేడు జమాఅత్ అహ్మదియ్య ద్వారా ప్రపంచములో వ్యాపిస్తున్న మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా వ్యాపింపవలసిన ఈ స్వచ్ఛమైన ఇస్లాం సందేశము మరెవరి ద్వారా వ్యాపించలేదు, వ్యాపించదు కూడ.

బెనీన్‌కు చెందిన అధ్యక్షుల వారు మరల ఇట్లు వ్రాసిరి: బోహెూయోకూ రీజన్‌లోని ఒక జమాఅత్‌లో నూతనంగా మన మస్జిద్‌ను నిర్మించితిమి. ఆ గ్రామములో మార్చి 2015న అహ్మదియ్యత్ స్థాపించబడినది. 245 మంది జమాఅత్‌లో చేరిరి. వారు జమాఅత్‌ను స్వీకరించిన రోజు నుండి వారికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుచుండెను.

బంధువుల నుండి వ్యతిరేకత ఎదురైనది. గ్రామ ఇమాం నుండి వ్యతిరేకత తీవ్రమవుచుండెను. గ్రామ ఇమాం ఇతర ఇమాంలను పిలిచి ఒక పెద్ద ఉద్యమాన్ని నడుపుటకు ప్రణాళిక రూపొందించుకొనెను. అయిన కూడ గ్రామ ప్రజలు అల్లాహ్ తాల దయతో వారి బైఅత్ వాగ్దానంపై స్థిరంగా ఉన్నారు. రెండు సంవత్సరముల క్రితం అచట మస్జిద్ నిర్మాణంను ప్రారంభించగా, అచటి ఇమాం అహ్మదీయుల మస్జిద్‌లో నమాజ్ సల్పుటకు బదులు మీరు ఏదైన చర్చిలో ప్రార్ధనలు చేసుకోవడం ఉత్తమమని బాహ్యంగానే వ్యతిరేకించడం ప్రారంభించెను. మస్జిద్ నిర్మాణం చేపట్టిన మేస్త్రిని వారి ఇంటికి వెళ్ళి భయ భ్రాంతులకు గురి చేసెను. వారి హెచ్చరికలు, వ్యతిరేకతలు కొనసాగినను అల్లాహ్‌తాలా దయతో మస్జిద్ నిర్మాణం పూర్తి గావించబడినది. ఆ మస్జిద్‌పై 13 మీటర్ల ఎత్తులో రెండు గోపురాలను కూడ నిర్మించిరి. చాలా అందమైన మస్జిద్ అది. 375 మంది ఒక్కసారిగా నమాజ్‌ను సల్పవచ్చును.

అల్లాహ్ తాలా స్వప్నంల ద్వారా ఏ విధముగా మార్గదర్శనం చేస్తుంటాడో వాటిని కూడ మనము చూడవచ్చును. సాన్ పెడ్రో అయివర్ కోస్ట్ అనే ఒక ప్రాంతము ఉండేది. ఆ ప్రాంతానికి చెందిన ఒక పట్టణంలో జుల్‌గమ్ అహ్మద్ గారు బైఅత్ చేసిరి. వారు పూర్వం క్రైస్తవులు. కాని తరువాత కాలంలో ఇస్లాంను స్వీకరించి, వహాబి వర్గములో చేరిరి. వారు ఇట్లు తెల్పిరి: "ఇస్లాంను స్వీకరించిన పిదపయే నేను నమాజ్‌ను నేర్చుకున్నాను. క్రమం తప్పకుండా మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చేసేవాడిని. ఆ సందర్భములోనే నేను ఒక పూజ్యనీయున్ని రెండు సార్లు స్వప్నంలో చూసాను. వీరు దైవం నుండి వచ్చిన అవతార పురుషులని నాకు మొదటి స్వప్నంలోనే తెలిసినది. దాంతో నేను బహుశా హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి దర్శన భాగ్యము లభించినదని భావించాను. కొంత కాలం గడిచిన తరువాత ఒక సందర్భములో ఆ పూజ్యనీయుని చిత్రమే టి.వి లో ప్రసారం కాసాగెను. ఒకరు వెనువెంటనే పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేయుచుండిరి. మరియు టి.వి క్రింది భాగంలో ఫ్రాన్స్ భాషలో " మిషన్ ఇస్లామిక్ అహ్మదియ్యా" అని వ్రాసి యున్నది. ఆ స్వప్నం తరువాత నేను జమాఅత్ అహ్మదియ్యను గూర్చి ఇమాం గారిని అడిగి తెలుసుకొనుటకు ప్రయత్నించాను. కాని ఇమాం గారు ముందుగా ఏవో కారణాలు చెబుతు సమాధానం చెప్పలేదు. కాని నేను పదే పదే ప్రశ్నించడంతో వీరు అహ్మదీయులు, వీరు ముస్లింలు కారు, నీకు ఏమైనది?, నీకు ఎవరు తప్పుడు మార్గంను సూచిస్తున్నారు?, నీవు నీ ఇస్లాంను ఎందుకు చెడగొట్టుకుంటున్నావు?అని ఆ ఇమాం గారు నన్ను మందలించెను. ఆ పట్టణంలో అహ్మదియ్యత్ లేకుండెను. (అనగా వారు నివసించుచున్న పట్టణంలో అహ్మదియ్య జమాఅత్ లేకుండెను) అందుకు వారు నాకు ఎవరు తప్పుడు మార్గంను సూచించడం లేదు, నేను ఇంతవరకు ఏ అహ్మదీయున్ని కలుసుకోలేదు. దేవుడే నాకు అహ్మదియ్యత్ మార్గంను చూపుతున్నాడని ఆ ఇమాం గారికి సమాధానం ఇచ్చితిని. మరల వారిట్లనిరి గృహమునకు వచ్చిన తరువాత చివరికి ఈ అహ్మదీయులు ఎవరు? వారిని ఇమాం గారు కాఫిర్లు అని ఎందుకన్నాడు? అని నాలో అందోళన అధికమైనది. దాంతో నేను అల్లాహ్ తాలా సన్నిదిలో ఓ అల్లాహ్! నీవే నాకు సరైన మార్గమును చూపించుమని చాలా దు:ఆలు చేసినాను. చుట్టు ప్రక్కల వారిని కూడ అహ్మదీయులను గూర్చి అడిగి తెలుసుకున్నాను. కాని ఎవ్వరు కూడ సరైన సమాధానంను ఇవ్వలేదు. చివరికి ఒక మిత్రుడు దాల్వా పట్టణంలో అహ్మదీయులు ఉన్నారని తెల్పెను. సమాచారం సేకరించిన వెంటనే నేను ఇతరులతో తెలుసుకుంటు మిషన్ హౌజ్‌కు చేరుకుంటిని. అచట మిష్నరి ఇంచార్జ్ గారు అహ్మదియ్యత్‌ను గూర్చి పరిచయం చేసిరి. అక్కడి మిషన్‌లో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి ఫోటోను చూసి నేను ఆశ్చర్య చకితుడనైనాను. ప్రశ్నించగా వీరే మసీహ్ మౌవూద్ మరియు ఈ కాలపు సంస్కర్తయని మిష్నరి గారు సమాధాన మిచ్చిరి. దాంతో వెంటనే నేను అహ్మదియ్యత్‌ను స్వీకరించితిని. అంతేగాకా రెండు సార్లు నేను స్వప్నంలో చూసినది కూడ వీరినే అని కూడ వారికి తెల్పితిని". అంతేగాకా నేను బైఅత్ ఫారంను ఈ రోజు పూరించుచున్నాను, కాని అల్లాహ్ తాలా నాకు స్వప్నంలో మార్గదర్శనం చేసిన నాటి నుండే నేను అహ్మదీయుడనని కూడ వారు మన ముభల్లిఘ్ గారికి తెల్పిరి. బైఅత్ చేసిన పిదప నుండి వారు క్రమం తప్పకుండా చందా వ్యవస్థలో భాగస్వాములైరి. గృహములో కూడ క్రమం తప్పకుండా నమాజ్ మరియు తహజ్జుద్ సల్పుచున్నారు. తమ ప్రాంతములోని ఇమాంతో పాటు ఇతరులకు కూడ అహ్మదియ్యా సందేశము అందిస్తున్నారు.

ఇవి అల్లాహ్ తాలా కార్యములు, అల్లాహ్ ఏవిధముగా మార్గదర్శనం చేయుచున్నాడో ఒక్కసారి వీక్షించండి, మరో వైపు కొందరు వారి సంకల్పం సరిగా లేనందున అనుమానించుతున్నారు.

మరల బెల్జియం నుండి మన ముభల్లిఘ్ గారు ఇట్లు వ్రాసిరి: బెల్జియం జమాఅత్‌లో నూతనంగా అహ్మదియ్యత్‌ను స్వీకరించిన ఇద్రీస్ గారు స్వప్నంలో ఒక పూజ్యుడిని చూసెను. ఇప్పటి వరకు ఆఫ్రికాకు చెందిన ఘటణలను ప్రస్తావించడం జరిగినది. ఇప్పుడు యూరప్ ఘటణల గూర్చి ప్రస్తావించుచున్నాను. ప్రతి చోట అల్లాహ్ తాలా మహిమలే కనిపిస్తున్నాయి. అప్పుడు అతనికి జమాఅత్ అహ్మదియ్యను గూర్చి ఏమియు తెలియదు. ఏ మిత్రుడైతే స్వప్నంలో ఒక పూజ్యుడిని తిలకించెనో అతడు రెండు సంవత్సరాల క్రితం కొన్ని చానల్స్‌ను మార్చుచుండగా అకస్మత్తుగా వారికి ఎం.టి.ఏ అల్ అరబియ్య కనిపించెను. అందులో వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిత్రమును చూడగానే వారికి వెంటనే స్వప్నంను గూర్చి గుర్తుకు వచ్చెను. వారు స్వప్నంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూసిరి. కావున వారు క్రమం తప్పకుండా ఎం.టి.ఏ కార్యక్రమాలను వీక్షించసాగిరి. ఆ విధముగా వారి హృదయం అహ్మదియ్యత్ వైపు మళ్ళినది. ఆ తరువాత వారు స్వయంగా బెల్జియం మిషన్ హౌజ్ చిరునామను తెలుసుకొని అచటకు చేరి నేను బైఅత్ చేయదలిచానని తెలుపెను. అందుకు మౌల్వి గారు జమాఅత్ గూర్చి తెలుసుకొనుటకు కొన్ని పుస్తకాలను చదువండని సలహా ఇవ్వగా, నా ప్రశ్నలన్నింటికి సమాధానం లభించినవని జవాబిచ్చిరి. వారికి మరికొన్ని విషయాలను గూర్చి వివరించి, సమస్యాత్మక విషయాలను గూర్చి సంభాషించినప్పుడు వారు ఆధారాలతో సమాధానం ఇచ్చేవారు. పైగా నేను ముందు నుండే అహ్మదియ్యత్ పట్ల సంతృప్తి చెందినాను అని తెల్పి బైఅత్ చేసిరి. చూడండి నేను ముందుగా తెల్పినట్లు ఆఫ్రికా వంటి సుదూర ప్రాంతాలలో అల్లాహ్ తాలా హృదయాలను తెరచినట్లు యూరప్‌లో కూడ తెరుచుచున్నాడు.

ఆఫ్రికాకు చెందిన మరో దేశం మాలి. అక్కడి ముభల్లిఘ్ గారు ఇట్లు వ్రాసిరి: ఒక వ్యక్తి మిషన్ హౌజ్ చేరుకొని నేను బైఅత్ చేయదలిచానని తెలుపెను. ఎందుచేత మీరు బైఅత్ చేయదలచినారని ప్రశ్నించగా నిన్న రాత్రి రేడియోలో ప్రసారమైన మీ ప్రత్యక్ష కార్యక్రమాన్ని నేను విన్నాను. ఆ సమయంలో కొందరు ప్రత్యక్షంగా ఫోన్ చేసి జమాఅత్ అహ్మదియ్యను గూర్చి దూర్భషలాడు చుండిరి. కార్యక్రమము మధ్యలోనే ఓ అల్లాహ్! వీరిరువురిలో ఎవరు సత్యవంతులో వారివైపు నన్ను నడిపించుమని నేను

## 7. సదా మార్గదర్శనముపై నిలుచటకు దుఆ

హజ్రత్ ఉమ్మె సల్మ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లు తెలిపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరచుగా ఈ దుఆ చేసేవారు. హృదయములను త్రిప్పువాడైన ఓ అల్లాహ్! నా హృదయమును తన ధర్మముపై నిలుపుము. ఓ అల్లాహ్ ప్రవక్త! హృదయములు కూడ మారుతాయా ? అని నేనడిగితిని. అప్పుడు హుజూర్ పవిత్ర ఖుర్ఆన్‌లో ని దుఆ చదివి ఇట్లనిరి. మానవుని హృదయము తప్పుదారి పట్టే అవకాశము సదా యుండును. కనుక తరచుగా ఈ దుఆ చదవవలెను. (అద్దురర్రుస్ మన్సూర్ లిస్సుయూతి సంపుటి 2 పుట 8)

رَبَّنَا لَا تُزِغْ قُلُوْبَنَا بَعْدَ إِذْ هَدَيْتَنَا وَهَبْ لَنَا مِنْ لَّدُنْكَ رَحْمَةً إِنَّكَ أَنْتَ الْوَهَّابُ

(ఆలె ఇమ్రాన్:9) అనగా ఓ మా పోషకుడా! నీ ఉపదేశము మేము పొందిన తరువాత మా హృదయములు చంచలము కాకుండు గాక! మాకు నీ అనుగ్రహమును ప్రసాదించుము. నిశ్చయముగా నీవే వరప్రదాతవు.

దుఆలు కోరుచు: సేఠ్ ముహమ్మద్ బషీరుద్దీన్ జమాఅత్ మాజీ రాష్ట్రాధ్యక్షులు ఆం.ప్ర.
మరియు కుటుంబీకులు: హైద్రాబదాద్

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None

మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

అల్లాహ్‌తాలాతో దుఆ చేసినాను అని సమాధానం ఇస్తూ మరల ఇట్లనిరి, నేను దుఆ చేస్తూండగానే నేను నిద్రకు ఉపక్రమించాను. ఆ రాత్రి స్వప్నంలో ఒకవైపు జమాఅత్ అహ్మదియ్య ముభల్లిఘ్ ఉండగా, మరోవైపు జమాఅత్ అహ్మదియ్యకు వ్యతిరేకులు ఉండిరి. వారి ఇరువురి మధ్య వాదోపవాదాలు జరుగుచుండెను. అహ్మదియ్య వ్యతిరేకులు ముభల్లిఘ్ గారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేని పరిస్థితి వచ్చినచో వారు ముభల్లిఘ్ గారిని ఒక గుంతలో వేసి వారిపై మట్టిపోసేవారు, ఇంతలో ఆకాశం నుండి ఒక పూజ్యుడు వస్తూ నేనే మహ్దిని అని ప్రకటించు కొంటు అహ్మది ముభల్లిఘ్ ప్రాణాలను కాపాడెను. అంతలోనే నేను నిద్ర నుండి మేల్కొంటిని. కావున నేడు అహ్మది య్యత్ సత్యమైనదనుటలో నాహృదయంలో ఎలాంటి సంకోచం లేదు కావున నేను బైఅత్ చేయుటకు వచ్చినాను అని సమాధానం ఇచ్చిరి.

ఎం.టి.ఏ ద్వారా ఏవిధముగా అల్లాహ్ తాలా మార్గాలను తెరుచుచున్నాడో చూడండి. ఫ్రాన్స్ దేశానికి చెందిన ముర్తజా అనే మిత్రుడు ముసల్మానుడు. అతడు జన్మతా అహ్మది కాదు. వారు జీవనం కొనసాగించే ప్రాంతములో అహ్మదీయులు లేరు. వారు ఈ సంవత్సరము బైఅత్ చేసిరి. వారిట్లు తెల్పిరి: నేను 8 లేదా 9 సంవత్సరాల వయస్సులో ఉండగా మసీహ్ దజ్జాల్ అనే పుస్తకమును చదువినాను. ఆ పుస్తకములో మూడు వర్గములను గూర్చి గలదు. ఒకరు విజయం పొందువారు. రెండవ వర్గీయులు పిరికిపందలు, మూడవ వర్గీయులు అమరత్వం పొందువారు. ఆ వయస్సులోనే నేను ఓ అల్లాహ్ నన్ను విజయం పొందు వారి వర్గములో చేర్చుము అని దుఆ చేసితిని. కొంత కాలం తరువాత మేము ఫ్రాన్స్‌కు వలస వెళ్ళినాము. అక్కడ ఒక రోజు నాకు టి.విలో ఎం.టి.ఏ ప్రసారాలు కనిపించాయి. ఆ విధముగా నేను జమాఅత్ గూర్చి తెలుసుకున్నాను. అప్పటి నుండి నేను క్రమం తప్పకుండా ఎం.టి.ఏ ప్రసారాలను తిలకిస్తున్నాను. ఈవిధముగా జమాఅత్ సత్యమైనదనే భావన నా హృదయంలో స్థిరపడింది. కాని నేను బైఅత్ చేయలేక పోయాను. ఏదో తెలియని కారణం వలన చాలా కాలం నుండి మాకు సంతానం కలుగడం లేదు. ఎం.టి.ఏ లో వచ్చే దుఆలను నేను క్రమం తప్పకుండా చదువేవాడిని. ఆ దుఆల ఫలితముగా అల్లాహ్ తాలా కొద్ది సమయంలోనే నాకు సంతానాన్ని ప్రసాదించాడు. వాస్తవానికి డాక్టర్స్ మాకు సంతానం కలుగదని సమాధానం ఇచ్చిరి. అయిన కూడ ఈ అద్భుతమును వీక్షించిన తదుపరి నేను ఈ సంవత్సరము 2016 లో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యతతను స్వీకరిస్తు బైఅత్ చేసితిని.

బాలల కార్యక్రమాల ద్వారా, క్రమ శిక్షణ గల బాలల వలన కూడ ప్రజలు ప్రభావితు లవుతుంటారు. ఈ విషయాన్ని వివరిస్తు బెనీన్ ముభల్లిఘ్ గారు ఇట్లు వ్రాసిరి: అతేసేలో మస్జిద్ ప్రారంభోత్సవ కార్యక్రమములో పవిత్ర ఖుర్ఆన్ పఠనము, అరబి ఖసీదా వినిపించబడెను. ఆ సమయంలో ప్రక్క గ్రామానికి చెందిన అహ్మదీయేతర ఇమాం ఇస్‌హాక్ గారు ఇట్లనిరి, బాలలు పఠించిన ఖుర్ఆన్ పఠనము, ఖసీద వలన మా మనసు చాలా ప్రభావితమైనది. ఒకవేళ వారు బాల్యం నుండే ఈ విద్యను నేర్చుకోలేక పోయినచో వారు ఏనాడు కూడ ఇంత చక్కగా చదివి వినిపించేవారు కాదు. జమాఅత్ అహ్మదియ్య బాలలకు చక్కని శిక్షణను ఇస్తుందనుటకు ఇదియే ఒక గొప్ప నిదర్శనము. అచట వారు ఉపన్యసిస్తు తల్లిదండ్రులు తప్పకుండా మీ పిల్లలను మస్జిద్‌కు పంపగలరని విన్నవించిరి. ఒకవైపు ఇస్లాంను నేర్పించేవారు బాలలతో ఉగ్రదాడులు చేయిస్తుంటే మరోవైపు అల్లాహ్ తాలా కృపానుసారం జమాఅత్ అహ్మదియ్య శిక్షణకు ప్రభావితులై ఇతరులు కూడ తమ పిల్లలను జమాఅత్ యొక్క మస్జిద్‌కు పంపించుటకు సిద్ధపడుచున్నారు.

బాలలకు శిక్షణనిచ్చి, వారికి ఇస్లాం బోధనలను నేర్పించి వారిని సమాజ శ్రేయస్సుకు అనుగుణంగా తీర్చిదిద్దుట కూడ మనకర్తవ్యమే. అందుకే వారికి శిక్షణనిస్తున్నారు. అందువలనే నేను ముందే తెల్పినట్లు ప్రజలపై జమాఅత్ ప్రభావం చూపుతుంది.

సేరాలెవన్ అనే మరో దేశంలో బూ ప్రాంతంలోని సన్ జమాఅత్‌లో మన మౌల్వి చాలా శ్రద్ధతో భాధ్యతలను నిర్వహిస్తున్నాడు. వారు అచట అహ్మది, అహ్మదియేతర బాలలకు ప్రతి రోజు క్లాసులు తీసుకొనుచు వారికి ఇస్లాం ధర్మపు ప్రాథమిక సూత్రాలను నేర్పుచున్నారు. వారి క్లాసులను అహ్మదియేతర బాలలు కూడ నేర్చుకుంటున్నారు. ఆ అహ్మదియేతర బాలుని పేరు అహ్మద్ కోంటే. అతడు చాలా వరకు నేర్చుకొనెను. ఒకరోజు అతని తండ్రి అబ్దుల్ గారు (ఇతడు కూడ అహ్మదియేతరుడు) వజూ చేస్తుండగా ఆ 11 సంవత్సరాల బాలుడు తన తండ్రి వద్దకు చేరుకొని మీరు సరిగా వజూ చేయడం లేదని తెల్పి, ఆ బాలుడు మరో చెంబులో నీళ్లు తీసుకొని వజూ చేయు సరైన విధానమును చేసిచూపెను. ఆ తరువాత వజూ చేస్తున్నప్పుడు చదువే దుఆను మరియు మస్జిద్‌లో ప్రవేశించు దుఆను నేర్పించెను. ఆ బాలుని తండ్రి ఇవన్నియు చూసి చాలా ఆనందించెను. ఇవన్నియు నీవు ఎక్కడ నేర్చుకున్నావని ప్రశ్నించెను. అందుకు ఆ బాలుడు నేను అహ్మదియ్య మస్జిద్‌కు వెళ్ళి నేర్చుకుంటున్నానని సమాధానం ఇచ్చెను. అందుకు ఆ బాలుని తండ్రి సంతోషంతో మన మౌల్వి గారి వద్దకు చేరుకొని ఈ రోజు నుండి నేను నా కుమారిడిని మీకు అప్పగిస్తున్నాను. మీరు ఈ బాలున్ని మీకు అనుగుణంగా మార్చుకొని మంచి శిక్షణను ఇవ్వగలరని వేడుకొనిరి. చూడుము వీరు అహ్మదీయులు కాకపోయినను వీరి పిల్లలకు జమాఅత్ ఇచ్చే శిక్షణా తరగతుల వలన చాలా ప్రభావితులైనారు. పిల్లలకు ఇస్లాం బోధనలను నేర్పించుటకు ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలనే విషయమును అహ్మదీయ తల్లిదండ్రులందరు, జమాఅత్ నిర్వాహకులు, ముభల్లిఘ్‌లు, మౌల్వీలు అందరు గుర్తుంచుకోవాలి. ఒకవైపు రాబోవు సంతానమును కాపాడుకోవసిన బాధ్యత మనపైనే గలదు, మరోవైపు బాలల ద్వార కూడ శిక్షణ, ప్రచార మార్గాలు సుమగం అవుతుంటాయి.

పొరుగు వారి హక్కులను నెరవేర్చుట కూడ ఇస్లాం ప్రాథమిక బోధనలలో ఒక భాగమే. పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ ఇందుకై ఆదేశములు గలవు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ ఈ విషయములో ప్రత్యేక శ్రద్ధను కనబర్చిరి. అయివరి కోస్ట్ నుండి మన ముభల్లిఘ్ గారు ఇట్లు వ్రాసిరి: ఆదమ గారు అనే వ్యక్తి ఈ సంవత్సరము బైఅత్ చేసి జమాఅత్‌లో చేరిరి. వారిట్లు తెల్పిరి, అహ్మదియ్యత్‌ను స్వీకరించక ముందు అహ్మదియేతర మస్జిద్‌లలో నేను నమాజ్ సల్పేవాడిని. అహ్మదీయులను గూర్చి నేను ఎంత చెడుగా విన్ననగా ఆ చెడు ప్రభావం వలన అహ్మదియ్య మస్జిద్ సమీపంలో ఉన్నా కూడ దూరంలో ఉన్న అహ్మదియేతర మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ సల్పుటకు ప్రాధాన్యతను ఇచ్చేవాడిని. ఒకసారి నేను చాలా అనారోగ్యమునకు గురి కాగా అహ్మదియ్య మస్జిద్ ఇమాం గారు నన్ను పరమార్శించుటకు వచ్చిరి. ఈ విషయం నా హృదయంపై చాలా ప్రభావంను చూపినది. ఆరోగ్యవంతుడినైన తరువాత అహ్మదియ్య మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ సల్పడం ప్రారంభించాను. మస్జిద్‌లో కొనసాగుచున్న తరగతుల వలన జుమా ప్రసంగాల వలన అహ్మదియ్యత్ పట్ల నాకు రోజు రోజు ఆసక్తి పెరుగుచు పోయినది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రచనలను చదివిన పిదప నేడు ప్రపంచములో పవిత్ర ఖుర్ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సాంప్రదాయాన్ని ఏ జమాఅతైన ఆచరిస్తున్నచో అది కేవలం జమాఅతే అహ్మదియ్య అనే నమ్మకం నాకు కల్గినది. అందువలనే నేను బైఅత్ చేసినాను. నేను బైఅత్ చేసినందున నా పిల్లలు కూడ జమాఅత్ పట్ల శ్రద్ధ చూపడం ప్రారంభించిరి. ప్రస్తుతం నా కుమారుడు సెకండ్రి స్కూల్‌లో చదువుచున్నాడు. స్కూల్ విద్యాభ్యాసం పూర్తి కాగానే తన జీవితంను జమాఅత్ సేవకు అంకితం చేసి జామిఆ అహ్మదియ్యాలో విద్యనభ్యసించుటకు సిద్ధమైనాడు.

ఏ విధముగానైతే వ్యతిరేకులు జమాఅత్ అభివృద్ధిలో ఆట్టంకాలను కల్పించుటకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారో, వ్యతిరేకతలో హెచ్చు మీరుతున్నారో, అదే విధముగా అల్లాహ్ తాలా కూడ వారి నోటిని కట్టడిచేయించు మార్గాలను కూడ ఏర్పాటు చేయుచున్నాడు. నూతనంగా అహ్మదియ్యత్‌ను స్వీకరించేవారి హృదయాలలో కూడ విశ్వాసాన్ని పటిష్టం చేస్తున్నాడు.

అల్లాహ్ తాలా అనుగ్రహములతో కూడిన కొన్ని ఘటనలు ఇవి. వీటిని నేను మీ ముందు ప్రస్తావించాను. అల్లాహ్ తాలా ఎల్లప్పుడు అతని అనుగ్రహములను పొందుటకు, అతని హక్కులను చెల్లించుటకు మనలను అర్హులను చేయుగాకా! అహ్మదియ్యత్‌ను స్వీకరించు భాగ్యమును మనకు కల్పించి మనపై ఉపకారం చేసెను. కావున అందులో మన విశ్వాసాన్ని పటిష్టము చేస్తు, మన పాదములను స్థిరపరుస్తు, మన విశ్వాసాన్ని, వివేకాన్ని అభివృద్ధి చేయును గాకా!

(ఆమీన్)

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001

The Weekly **BADAR** Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్

Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516

Vol.1. Thursday 29 SEP 2016 Issue No.30

MANAGER
NAWAB AHMAD
Tel : (+91)-1872-224757
Mobile. : (+91) 94170-20616
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-


జమాఅత్ అహ్మదియ్య బిలీజ్ (సెంట్రల్ అమెరికా) రెండు రోజుల రెండవ వార్షిక బహిరంగ సభ జనవరి 30,31వ తేది 2016న గేట్‌వే యూత్ సెంటర్ బిలీజ్ పట్టణములో నిర్వహించబడినది. ఈ వార్షిక సభలో మొత్తం 110 మంది పాల్గొనగా అందులో 42 మంది జమాఅత్ సభ్యులు కాగా, 68 మంది అహ్మదీయేతర ముస్లిం అతిథులు. సభలో పాల్గొన్న ప్రముఖులలో ఒకరైన బిలీజ్ పట్టణ మేయర్ గారు ఉపన్యసిస్తు "ఇస్లాం గూర్చి నామదిలో ఉన్న చెడు అభిప్రాయాలు స్వచ్ఛమైన ఇస్లాం (అనగా అహ్మదియ్యత్) ద్వార తొలిగిపోయినవి. అంతేగాక ఇస్లాం శాంతియుత ధర్మమనే గట్టి నమ్మకం నాలో కల్గినది" అని తమ అభిప్రాయమును వెల్లడించగా, విద్యా మరియు క్రీడారంగ మంత్రివర్యులు గౌ॥ పీటర్క్ ఫీబర్ గారు ఉపన్యసిస్తు "అహ్మదీయులను వారి ప్రాంతీయులే వారి దేశం నుండి వెళ్లగొట్టిరి, కాని మేము మీ అందరిని సహృదయంతో మా దేశానికి ఆహ్వానిస్తున్నాము. అంతేగాకా మీకు పూర్తి ధార్మిక స్వేచ్ఛను కూడ కల్పించెదము" అని అహ్మదీయుల పట్ల సానుభూతిని ప్రకటించిరి. ఈ వార్షిక బహిరంగ సభలో పాల్గొన్న వారందరికి హుజూర్ అన్వర్ అయ్యదహు అల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ప్రేమ పూర్వకమైన ఒక సందేశమును పంపిరి. పాఠకులు ప్రయోజనం పొందుటకై ఆ సందేశమును ఇచట ప్రచురించుచున్నాము. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను జులై 29, 2016 నాటి అల్ ఫజల్ ఇంటర్నేషనల్ ద్వార చదువవచ్చును. (సంపాదకులు)

ప్రియమైన అహ్మదియ్య ముస్లిం బెల్జియం జమాఅత్ సభ్యులారా!

అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహి వబర్ కాతహు.

జనవరి 30, 2016వ తేది నుండి మీరు మీ జాతీయ రెండవ వార్షిక బహిరంగ సభను నిర్వహించుకొంటున్న విషయం తెలిసి నేను చాలా ఆనందించాను. ఈ సందర్భమున నేను చేయు దుఆ ఏమనగా అల్లాహ్ తాలా తన అనుగ్రహముతో మీ వార్షిక సభను అన్ని విధాలుగా విజయవంతం చేయు గాకా! మరియు పావనులు సంఘటితమవుచున్న ఈ వేళ సభలో పాల్గొను వారందరు ఆధ్యాత్మిక ఘనతను చేకూర్చు అనుగ్రహములను పొందు గాకా! (ఆమీన్)

అల్లాహ్ తాలా అనుగ్రహము వలన మీరు మీ బైఅత్ ప్రతిజ్ఞలను సమర్పించు కొంటిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ను విశ్వసించిరి. కావున మీకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణను గూర్చిన రెండు ముఖ్య ఉద్దేశాలు అర్థమై ఉండవలెను.

ప్రథమ ఉద్దేశం ఏమిటనగా అల్లాహ్ తాలాతో ప్రగాఢ అనుబంధమును ఏర్పర్చుకొను విశ్వాసుల ఒక సంఘమును రూపకల్పన చేయుట. వారి జీవిత లక్ష్యం కేవలం అతనిని ఆరాధించుటయే కావలెను. ద్వితియ ఉద్దేశము మానవ సేవకు అధిక ప్రాముఖ్యతనిస్తు, ఇస్లాం విశిష్టతలను, ఉపకారములను ప్రపంచ మంతయు వ్యాపింపజేయుట.

మానవుని జీవిత లక్ష్యము కేవలం అల్లాహ్ తాలాను ఆరాధించుచు, అతని సాన్నిహిత్యంను పొందుటయే నని పవిత్ర ఖుర్ఆన్‌లో తెల్పబడినది. పవిత్ర ఖుర్ఆన్ బోధనల అనుసారం ఆరాధనకై ఉత్తమ విధానం నమాజ్ మాత్రమే. కావున అహ్మదీయులందరు ప్రతి రోజు ఐదు పర్యాయముల నమాజ్‌లను భక్తి శ్రద్ధలతో సల్పవలెను. అంతేగాకా వాటిని సమయాను కూలంగా సామూహికంగా సల్పుటకు అధిక ప్రాముఖ్యత నివ్వవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి: "నేను మీకు మరల తెల్పునది ఏమనగా ఒకవేళ అల్లాహ్ తాలాతో స్వచ్ఛమైన అనుబంధమును, వాస్తవమైన సంప్రదింపులను ఏర్పర్చుకొన దల్చినచో నమాజ్‌ను అలవర్చుకొనుము. ఎంతగా అలవర్చుకోవలెననగా మీ శరీరం, మీ ఉచ్చరణలే గాకుండా మీ ఆత్మ ఆకాంక్షలు, అభిప్రాయములు అన్నియు నమాజ్ కావలెను."

(మల్ఫూజాత్ సంపుటి1, పుట 170)

మానవ సేవనుద్దేశించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ సంఘ సభ్యులకు ఇట్లు ఉపదేశించిరి: "వారు పేదవారికి ఆశ్రయమును కల్పించునంతగా ఉదాశీణతను కల్గి యుండవలెను. అనాథలకు తండ్రుల వలె నిలువవలెను. ఇస్లాం కార్య సిద్ధికై అభిమానం గల వ్యక్తుల వలె తమను తాము అంకితం చేసుకోవలెను. వారి సహజ సద్గుణములు ప్రపంచమంతయు వ్యాపించునట్లు పూర్తి శక్తి సామర్థ్యంలతో ప్రయత్నంలు చేయవలెను. అదే విధముగా దైవభక్తి, దైవ భక్తులకై గల సానుభూతిల పవిత్ర చెలిమ ప్రతి ఒక్కరి హృదయం నుండి ప్రవహించుతు అవన్నియు ఒకే చోట ఏకమై ఒక నదిలా ప్రవహించునట్లు కనిపించవలెను. ..... ఎందుకనగా అల్లాహ్ తాలా ఈ సమాజంను తన వైభవము, తన దివ్యత్వంను ప్రదర్శించుటకు పుట్టించి దానిని వృద్ధి పర్చదలిచెను. తద్వారా ప్రపంచములో దైవభక్తి, దైవానుగ్రహం, పవిత్రత, వాస్తవమైన పుణ్యం, శాంతి, సద్భావన, మానవ సేవ పట్ల గల సానుభూతి వ్యాప్తిచెందించును"

(మజ్‌మూఆ ఇష్తిహారాత్, సంపుటి1, పుట 197-198)

మీరు నా జుమా ప్రసంగములను, ఇతర ఉపన్యాసములను క్రమం తప్పకుండా వినవలెనని నేను మీకు ప్రోద్భలము చేయుచున్నాను. దీని ద్వారా మీకు ఖిలాఫత్ యొక్క శుభప్రధమైన వ్యవస్థతతో పటిష్ఠమైన అనుబంధము మరియు విధేయతలో దృఢత్వం కల్గును. మీ సంతానంనకు కూడ ఖిలాఫత్ ద్వారా లభించే ప్రత్యేక అనుగ్రహములను గూర్చిన అవగాహన కల్పించవలెను. మరియు వర్తమాన ఖలీఫాతో అనుబంధమును పెంచుకొనుటకై, విధేయత, వినమ్రతను పాటించుటకై వారికి ప్రోత్సాహంను అందించుము. నేటి కాలంలో ఖిలాఫత్ వ్యవస్థతో అనుసంధాన మైనప్పుడే ఇస్లాం పునరుద్దరణ కార్యము పరిపూర్ణతకు చేరుకొనును. కావున మీలో ప్రతి ఒక్కరు ఈ పవిత్రమైన వ్యవస్థను పటిష్ఠం చేయుటకు ముందుకు సాగవలెను. అంతే గాకుండా మీరు, మీ రాబోవు సంతానం, వారి సంతానం అందరు అహ్మదియ్య ఖిలాఫత్ శుభప్రదమైన నాయకత్వంలో, సారథ్యంలో జీవితంను కొనసాగించె దమనే నమ్మకంను కూడ కల్పించవలెను.

మన జమాఅత్ సభ్యులు ఎల్లప్పుడు తమ సంస్కరణ కొరకు ప్రయత్నించాలన్నదే నా అభిలాష. అంతేగాక దైవభీతిలో కూడ ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలి. తద్వారా ప్రపంచ ముస్లింలకు మీరు ఉదాహరణగా నిలువెదరు. కావున నేను నా జుమా ప్రసంగంలో పదే పదే మీకు శ్రద్ధను కల్పించినట్లు మీ అంతరాత్మను పరిశీలించు కొంటు, తమను తాము సంస్కరించు కొంటు, ఎల్లప్పుడు మంచి నడవడికను నడుచుకోవాలి. తమను తాము పరిశీలించుకోవడం చాలా ముఖ్యం. ప్రతి రోజు తమ దినచర్యలపై దృష్టిని కేంద్రీకరించాలి. అదే విధముగా తమ రోజువారి కార్యక్రమాలలో సభ్యత, సంస్కారమును కనబర్చాలి. తద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కన్న కలలను నిజం చేసిన వారిలో మీరు చేరెదరు. ఒకవేళ మీరు మీ ఆధ్యాత్మికతలో వృద్ధి చెందనిచో కేవలం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యవంతుడని విశ్వసించుటలో ఏ ప్రయోజనం కలుగదని తెలుసుకోవాలి. అల్లాహ్ తాలా మీ వార్షిక బహిరంగ సభను అన్ని విధాలుగా విజయవంతం చేయును గాకా! మీ అందరికి దైవభీతిలో, ఆధ్యాత్మికతలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించు భాగ్యమును కల్గించును గాకా!.

చివరిగా వార్షిక సభలో పాల్గొను వారిని గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన దుఆ: "చివరిగా నేను ఈ దుఆతో ముగిస్తున్నాను, ఈ ఆధ్మాత్మిక సభలో పాల్గొనుటకు ప్రయాణించు ప్రతి వ్యక్తికి అల్లాహ్ తాలా తోడుగా నిలుచును గాకా!, వారికి ఉత్తమ ప్రతిఫలమును అందించును గాకా!, వారిని కరుణించును గాకా! వారి కష్టాలను, వారి బాధలను వారిపై సులభతరం చేయును గాకా!, వారి కష్ట దు:ఖాలను దూరం చేయును గాకా!, వారిని అన్ని రకాల ఇబ్బందుల నుండి రక్షించును గాకా!, వారి కోరికలు నేరవేరు మార్గములు వారిపై బహిర్గతము చేయును గాకా!, ప్రళయ కాలం నాడు వారిని తన అనుగ్రహం, దయ కురిపించు వారితో కలపి సజీవులను చేయుగాకా! వారి ప్రయాణంనకు చివరి మజిలి వారి ఖలీఫాయే నిలుచును గాకా!, ఓ దైవమా! ఓ శ్రేష్ఠతతో అనుగ్రహించు వాడా! ఓ కరుణా మయుడా! ఓ ఆపదలను తీర్చువాడా! ఈ దుఆలన్నింటిని స్వీకరించుము. మా వ్యతిరేకులపై మాకు తేజోవంతమైన నిదర్శనములతో కూడిన విజయంను ప్రసాధించుము. నిశ్చయముగా నీవే సర్వాధికారివి, సర్వ శక్తివంతుడవు. (ఆమీన్ సుమ్మ ఆమీన్) (మజ్‌మూఆ ఇష్తిహారాత్ సంపుటి1, పుట 342)

ఇట్లు
మీ శ్రేయోభిలాషి
మిర్జా మస్రూర్ అహ్మద్
ఐదవ ఉత్తరాధికారి






Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz